# ఒక్కడే మహాత్ముడు – ఆయనే పరిష్కారం

సమిత్వాణి

ప్రతి మనిషికీ జీవితం ఒక సమస్య. అట్టి జీవిత సమస్యే అనేక విధాల, అనేక పరిస్థితుల రూపంలో,అనేక సమస్యల రూపంలో ప్రతివారికీ అనుభవమవుతుంది. అయితే మానవ ప్రజ్ఞ కొంతవరకూ మేలుకొన్న కొందరికి, అందరినీ బాధించే ఈ జీవిత సమస్యకు పరిష్కారాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస భగవత్కృపవలన కలుగుతుంది. అట్టి వ్యక్తులు తిరిగి భగవత్కృపవలన సరిగా అన్వేషించినప్పుడు అట్టి సమస్యను అతిక్రమించిన మహాత్ములు, వారి చరిత్రలు మరియు బోధలను అందుకుని, వాటినుంచి సరియైన స్ఫూర్తిని పొందుతారు. ఒక్కొక్కరికి వారి సంస్కారబలాన్ని అనుసరించి అలా జీవిత సమస్యను అతిక్రమించి దైవ సమానులుగా రూపొందిన జ్ఞానులలో ఒక్క మహాత్ముని అనుసరించాలన్న తపన(శిష్యభావం) కలుగుతుంది. కాలక్రమేణ సమయమాసన్నమైనప్పుడు తగిన గురవు(సశరీరంగానైనా, కాకపోయినా) అట్టి వ్యక్తికి లభిస్తారు. అట్టి సద్గురువును సరైన రీతిన సేవించి, వారందించిన బోధలను నిజాయితీగా ఆచరించయత్నించే కొద్దీ అట్టి శిష్యునికి తన గురువే సర్వస్వమన్న వాస్తవం హృదయంలో ముద్రపడడం ఆరంభమవుతుంది. అందరు దేవతలు, మహాత్ములు, చివరకు సకల సృష్టీ వారి రూపమేనన్న విశ్వాసం కలుగుతుంది.

అట్టి శిష్యునికి క్రమేపి చాలామంది మహాత్ములు కనిపించడం మాని, ఆ రూపాలన్నీ వివిధ దేశకాలలననుసరించి తన గురువు ధరించిన రూపాలేనని, అన్ని మహనీయుల చరిత్రలు తన గురువు యొక్క చరిత్రలని, వారి క్షేత్రాలు తన గురువు యొక్క క్షేత్రాలేనని అనిపించడం(అర్థం అవ్వడం) జరుగుతుంది.

> **కాలక్రమేణ సమయమాసన్నమైనప్పుడు తగిన గురవు (సశరీరంగానైనా, కాకపోయినా) అట్టి వ్యక్తికి లభిస్తారు.**

ఇక అతని దృష్టిలో అనేకులైన మహాత్ములు ఉండరు. ఒకే మహాత్ముడు, తన గురువు ఉంటారు. వేరువేరు మహాత్ములు వేరువేరుగా కాక తన గురువు స్వరూపంగా గోచరిస్తారు. ఎవరిని దర్శించినా, ఏ క్షేత్రం దర్శించినా, ఏ తీర్థం దర్శించినా తన గురుస్థానాన్ని దర్శించినట్లుంటుంది అట్టి భక్తునికి. వ్యవహారానికి మాత్రం కొంతవరకు వైవిధ్యాన్ని ప్రదర్శించవలసి వచ్చినా, ఆంతర్యంలో అట్టి వైవిధ్యం తొలగిపోతుంది. వివిధ సాంప్రదాయాలూ, మతాలూ, అందులోని మహాత్ములూ, దేవతలూ - అందరూ తన గురురూపంగా గోచరించి, తాను తన సద్గురువు వద్ద నేర్చిన పాఠాల వలన కలిగిన వివేకం వలన వాటన్నిటి సామరస్యాన్ని అవగాహన చేసుకుని ఉంటాడు అట్టి శిష్యుడు. అతనికి సాంప్రదాయాల మధ్య భేదాలు అంటవు. క్రమంగా సకల మానవులతోనూ, సకల జీవరాశితోనూ, సకలసృష్టితోనూ సామరస్యం కలిగి, అందరి, అన్నిటి పట్ల సమభావంతో, ధర్మబద్ధంగా తయారవుతుంది అతని జీవితం.

ఎవరు ఏ మార్గాన్ని అవలంబించినా, చివరకు జరుగవలసినది, జరిగేది ఇదే. ఒక్కొక్కరికి ఒక్కో మహాత్ముడు స్ఫూర్తినిస్తే, ఒక్కొక్కరికి ఇష్టదేవత, కొద్దిమందికి వివిధ సిద్ధాంతాలు అట్టి స్ఫూర్తినిస్తాయి. వీరందరికీ కూడా చిత్తశుద్ధి కలిగే కొద్దీ పై చెప్పుకున్న వరుసలో ఆధ్యాత్మికాభివృద్ధి కలుగుతుంది. సంస్కార భేదంవలన, శ్రద్ధవలన, కొందరికి అతి సీఘ్రంగానూ, కొందరికి మరికొంత కాలవ్యయంతోనూ ఇట్టి మార్పు జరుగుతుంది. ఇలా జరిగినప్పుడు జీవితం ఇక సమస్య కాకుండాపోతుంది. కనుక 'సమస్య'లు లేకుండాపోతాయి. సమ-ఆధానం(సమాధానం) కుదురుతుంది. ఇట్టిది సర్వులకు కలిగేలా అనుగ్రహించమని, గతిస్తున్న సంవత్సరంలో చేసిన లోపాలను క్షమించమని, రాబోయే నూత్న సంవత్సరంలో సకల శుభాలూ అందరికీ కలిగించమని భగవంతున్ని ప్రార్థిస్తూ, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటాను.

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

SRI MANGA BHARDWAJA TRUST

చీఫ్ ఎడిటర్: శ్రీ పోలూరి శ్రీనివాసరావు బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

సంపుటి: 28 డిసెంబర్ 2010 సంచిక: 8

**మన వ్యక్తిత్వాలనే మట్టి విగ్రహాలను శ్రీసాయిలీలా శ్రవణ మననమనే మహాసాగరంలో విలీనం చేయువలసిన తరుణమొచ్చింది. అప్పటికిగాని నిజమైన భగవదారాధన పరిపూర్తి చెందదు. వ్యక్తి ప్రాధాన్యంగల నేటి రీతులన్నీ, వెనుకటి వాటివలెనే కాలగతిలో కరిగిపోతాయి. ప్రకృతి ధర్మంలా శాశ్వతంగా ఆధ్యాత్మ జీవితాన్ని శాసించగలవు సాయి ధర్మసూత్రాలు.**

**- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ**

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు. శ్రీ మంగభరద్వాజ ట్రస్టుకు ఎటువంటి బాధ్యతా లేదు.

## విషయసూచిక

1. ఒక్కడే మహాత్ముడు–ఆయనే పరిష్కారం 01
2. ముముక్షువుల పాలిటి కల్పవృక్షము 'శ్రీ గురు చరిత్ర' 03
3. శ్రీ సాయి సచ్చరిత్ర 06
4. శ్రీ దత్తలీలామృతము – సీరియల్ 08
5. వార్తాలాపము – సీరియల్ 12
6. కాలస్వరూపాన్ని మనకన్నుల ముందు వెలిగించే వేదాంగం! 15
7. ఏకం సత్–విప్రాః బహుదావదన్తి 17
8. శ్రీ భరద్వాజ రచనామృతం 19
9. శక్తికొలదిగానే ధర్మకార్యాలకు వెచ్చించాలి 20
10. మౌఢ్యాన్ని వీడితే మతాలసారం ఒక్కటేనన్న సాయి–క్రీస్తులు 22
11. 'సాయిలీలామృతం' మరో 'గురుగ్రంథసాహెబ్!' 25
12. సాయి చరిత్రలు వ్రాయకండి 28
13. గురువుగొప్పా? దైవంగొప్పా? 29
14. సాయిబాబా చూడ్డానికెలా ఉండేవారు? 29
15. నిరాడంబరత–రమణమహర్షి 30

### చందా వివరములు

| | |
|---|---|
| విడిప్రతి | : రూ. 10-00 |
| సంవత్సర చందా | : రూ. 100-00 |
| జీవిత చందా | : రూ. 1,116-00 |

(సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును)
(20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది)

| | |
|---|---|
| రాజపోషకులు | : రూ. 3,000-00 |
| మహారాజపోషకులు | : రూ. 5,000-00 |

### చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P,Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500 068
website: www.saibharadwaja.org
www.saimasterforums.org

# ముముక్షువుల పాలిటి కల్పవృక్షము 'శ్రీ గురు చరిత్ర'

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

ఉత్తమమైన సాధనకు సద్గురువును ఆశ్రయించడం ఆవశ్యకమని అటు ఉపనిషత్తులు, భగద్గీతాది సద్గ్రంథాలే గాక శ్రీరామకృష్ణ పరమహంస, శిరిడీ సాయిబాబా, రమణమహర్షి వంటి ఆధునిక ఆత్మజ్ఞానుల చరిత్రలూ, బోధలూ కూడా, ఏక కంఠంతో ఘోషిస్తున్నాయి. శ్రీ జిడ్డు కృష్ణమూర్తివంటివారు గురువావశ్యకం కాదని చెప్పినట్లు కన్పించినా జీవితాన్ని ఎలా సార్థకం చేసుకోవాలో తెల్పడానికి వారిచ్చే వివరణలను వేద వాక్యాలుగా అంగీకరించే వారందరికీ తిరిగి వారు ప్రచ్ఛన్న గురువులవడం యిందుకు ప్రబల తార్కాణం.

ఉత్తముడైన సద్గురువును ఎన్నుకోవడం యీ రోజుల్లో చాలా కష్టం. కలిప్రభావం వలన ఎందరో ఆత్మజ్ఞానం పొందకనే పొందినట్లు నటిస్తూ, గురువులమని చెప్పుకొంటూ, శిష్యులను చేర్చుకొంటూ స్వార్థం గడుపుకొంటున్నారు. అట్లా అని గురువును ఆశ్రయించక తప్పదు. ఇటువంటప్పుడు సరియైన గురువును చేరాలని కోరేవారు శ్రద్ధా భక్తులతో స్కాందపురాణాంతర్గతమైన 'గురుగీత'ను, 'శ్రీ గురుచరిత్ర'ను అర్థయుక్తంగా నిత్యమూ పారాయణ చేస్తూంటే దివ్యమైన సంకేతం రూపంలో తగిన ఆదేశమొస్తుందన్నది సాంప్రదాయమేగాక భక్తుల అనుభవం కూడా. అటువంటి సందేశాన్ననుసరించి ఆత్మజ్ఞానం పొందిన వారెందరో ఉన్నారు. కొందరి అనుభవాలను ఉదహరిస్తాను.

ఒక ధనికుడు సంతానార్థియై గాణ్గాపురంలో దీక్షగా కొంతకాలం నిత్యమూ 'శ్రీగురుచరిత్ర' పారాయణ, పూజ చేసి తనకు మగబిడ్డ కల్గితే 1000 మంది బ్రాహ్మణులకు భోజన సంతర్పణ చేస్తానని మ్రొక్కు కొన్నాడు. సంవత్సరం లోపల అతడి కోరిక నెరవేరిందిగాని, వ్యాపారంలో నష్టంవచ్చి సర్వాన్ని కోల్పోయాడు. ఆ దిగులుతోనే అతడు మరణించాడు. అతని భార్య కష్టం చేసి బిడ్డను సాకుతూంది. కాని మ్రొక్కు చెల్లించని కారణంగా అతడికేమైనా అపాయం సంభవిస్తుందేమోనని భయపడుతుండేది. ఆత్మీయులొకరు ఆమెను ఆ దత్తమూర్తినే శరణువేడమని సలహాయిచ్చారు. ఆమె గాణ్గాపురం వెళ్ళి తనకు ప్రత్యామ్నాయం తెల్పమని దత్తమూర్తిని ప్రార్థించింది. ఒక రాత్రి స్వప్నంలో స్వామి దర్శనం యిచ్చి "అక్కల్కోటలో స్వామిగా నేను ఉన్నాను. వారికి భిక్ష యిస్తే వేయి మంది బ్రాహ్మణులకు భోజనం పెట్టినట్లవుతుంది" అని చెప్పారు. ఆమె అక్కల్కోట చేరి స్వామిని దర్శించగానే ఆయన భిక్షకోరి, ఆరగించి, "అమ్మాయి! వేయిమంది బ్రాహ్మణులకు భోజనం ముట్టింది. చింతపడకు!" అన్నారు. 'శ్రీ గురు చరిత్ర' పారాయణ ద్వారా ఆమెకు స్వామియొక్క సాక్షాత్కారము, ప్రత్యామ్నాయ పద్ధతి, పరిపూర్ణుడైన సద్గురువు దర్శనము లభించాయి.

'శ్రీ గురు చరిత్ర' పారాయణ ద్వారా పూర్ణదైవానుగ్రహాన్ని పొందిన వారిలో శ్రీ వాసుదేవానందసరస్వతీ స్వామి ఒకరు. మొదట మరాఠీ భాషలో రచించబడిన 'శ్రీగురుచరిత్ర' గ్రంథాన్ని వీరు సంస్కృతంలోకి అనువదించి మానవాళికెనలేని సేవ చేసారు. వీరు 1854 లో సామంతవాడీకి సమీపంలోని మాణేగాంవ్ (మహారాష్ట్ర) లో ఒక సదాచార సంపన్నమైన కుటుంబంలో జన్మించారు. ఎనిమిదవ ఏట ఉపనయనం అయ్యాక వేదాధ్యయనం చేసి, ఆదర్శ గృహస్థుగా వైశ్వదేవాది యజ్ఞాలను ఆచరించారు. వీరు బాల్యం నుండీ మరాఠీ 'శ్రీ గురుచరిత్ర' పారాయణ నిత్యమూ చేసేవారు. ఒక రోజు శ్రీదత్తస్వామి వీరికి స్వప్న దర్శనమిచ్చి మంత్రోపదేశం చేశారు. దాని అనుష్ఠానంతోనే వీరు పరిపూర్ణులయ్యారు. వీరికి సాధకదశలో సందేహాలు కల్గినపుడు శ్రీదత్తుడు స్వప్న దర్శనమిచ్చి వారు సందేహ నివారణార్థం ఏ మహనీయుని దర్శించాలో తెల్పేవారు. అంతేకాక ఆ మహనీయునికీ దర్శనమిచ్చి, శ్రీవాసుదేవానందులకు సందేహనివృత్తి చేయమని ఆదేశించేవారు! వీరు 1891లో భార్య పరమపదించాక సన్యసించి దేశమంతటా పర్యటించి 1914వ సంవత్సరంలో నర్మదానది తీరానవున్న గరుడేశ్వర పుణ్యక్షేత్రంలో

**శ్రీ జిడ్డుకృష్ణమూర్తివంటివారు గురువావశ్యకం కాదని చెప్పినట్లుకన్పించినా జీవితాన్ని ఎలా సార్థకం చేసుకోవాలో తెల్పడానికి వారిచ్చే వివరణలను వేద వాక్యాలుగా అంగీకరించే వారందరికీ తిరిగి వారు ప్రచ్ఛన్న గురువులవడం యిందుకు ప్రబల తార్కాణం.**

పరమపదించారు.

ఖాండేశ్ జిల్లాలోని చాలిస్‌గాంవ్ అనే వూళ్ళో శంకరశాస్త్రి, లక్ష్మీబాయి అనే శిష్టాచార సంపన్నులైన దంపతులకు రెండవ కుమారుడైన 'నానా' (అసలు పేరు మార్తాండ్) బాల్యము నుంచి ఆధ్యాత్మిక జీవితంపట్ల విశేషమైన ఆసక్తి కల్గియుండేవాడు. అతడికి బాల్యంలో శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి వారింటికి వచ్చినపుడు అతడు తిన్నగా వెళ్ళి స్వామి వారి ఒడిలో కూర్చున్నాడు. స్వామి ప్రేమతో అతడికొక నల్లద్రాక్ష పండును ప్రసాదంగా యిచ్చారు. ఆ పిల్లవాడు ఆటలయందు, లౌకికమైన బడి చదువులపట్ల విముఖుడై ఎప్పుడూ పవిత్ర శ్లోకాలను పఠిస్తూండేవాడు. ఎనిమిదవ ఏట ఉపనయనమైన దగ్గరనుండీ అతడు శ్రేష్ఠుడైన గురువు వద్ద ఉపదేశాన్ని పొందాలని ఆరాటపడేవాడు. తండ్రి శంకరశాస్త్రి తన కట్టి అర్హతలేదన్నాడు. తన 11వ ఏట నానా నిత్యమూ ప్రాతః కాలంలో నిద్రలేచి సంధ్యావందనము, ప్రాణాయామము, దేవతార్చన చేస్తూ శ్రేష్ఠుడైన గురువుయొక్క అనుగ్రహాన్ని కోరి 'శ్రీ గురుచరిత్ర' గ్రంధాన్ని శ్రద్ధా భక్తులతో పారాయణ చేయనారంభించాడు. ఇలా ఏడు సప్తాహాలు పారాయణ చేస్తూ క్రమంగా తన ఆహారాన్ని తగ్గిస్తూ వచ్చి

నిర్వహించవలసిన కార్యమెంతో ఉన్నది. కనుక అందుకు తగిన ఉపదేశమే చేస్తాను". అని అలానే చేశారు స్వామి. గది తలుపులు తెరవడంతో తండ్రి శంకర శాస్త్రి ప్రవేశించి స్వామి వారికి పాదపూజ చేశారు. అతణ్ణి కూడా ఆశీర్వదించాక శ్రీవాసుదేవానంద స్వామి అంతర్హితులయ్యారు. అప్పటినుంచి నిత్యమూ 1200 గాయత్రీజపం చేసి, గురుచరిత్ర పారాయణ మధ్యాహ్నం వరకూ చేసి భోజనం చేసేవాడు. మరలా సాయంత్రం కూడా స్నానానంతరం పూజ, ఆరతి అయ్యాక అల్పాహారం తీసుకొని 'దిగంబరా, దిగంబరా, శ్రీపాదవల్లభ దిగంబరా' అన్న నామాన్ని జపించి తర్వాత 'శ్రీ గురుచరిత్ర' పారాయణ ఎంతోసేపు చేసేవారు. యుక్తవయస్సులో ఒక సౌశీల్యను వివాహమాడి, తన తీవ్ర తపశ్చర్యను కొనసాగించారు. ధర్మపత్ని చేతగూడా భగవద్గీతాది సద్గ్రంథపఠనతో పాటు 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేయించారు. ఒక పుత్రుడు జన్మించాక ఆమె మరణించడంతో మరొక వివాహము చేసుకొని ఆమె చేత కూడా సద్గ్రంథ పఠనాదులు చేయించారు నానామహరాజ్. ఒక కుమార్తె జన్మించాక రెండవ భార్యకూడ పరమపదించారు. గృహస్థ జీవితంలోనే నానామహరాజ్ ఎంతో కఠోరమైన తపస్సు చేసి బిడ్డలను ఒక

**"బిడ్డా!" అన్న ప్రేమపూర్వకమైన సంబోధన విని కళ్ళు తెరచేసరికి ఎదుటనున్న ఆసనం మీద శ్రీవాసదేవానందసరస్వతీస్వామి నిలుచుని దర్శనమిచ్చారు.**

ఆరవవారం వచ్చేసరికి కేవలం నీరుత్రాగి జీవించడమారంభించాడు. తండ్రి అనుమతి, ఆశీస్సులతో ఒక గదిలో గడియవేసుకొని తన దీక్షలో నిమగ్నుడై పోయాడు. తన గురువుకొక ఆసనం సిద్ధంచేసుకొని నిత్యమూ అద్భుత రీతిన తనకు తగిన గురువు రాగలరని తలచి వారి పాద పూజకు పూజా ద్రవ్యాలను సిద్ధంగా ఉంచుకొనేవాడు. ఎన్ని రోజులు నిరీక్షించినా తనకలాంటి భాగ్యం కల్గకపోవడంతో కన్నీరు మున్నీరుగా శోకించసాగాడు. వెంటనే "బిడ్డా!" అన్న ప్రేమపూర్వకమైన సంబోధన విని కళ్ళు తెరచేసరికి ఎదుటనున్న ఆసనం మీద శ్రీవాసుదేవానందసరస్వతీస్వామి నిలుచుని దర్శనమిచ్చారు. "బిడ్డా! యింత కఠిన దీక్ష ఎందుకు చేశావు? నేను చాతుర్మాస్యవ్రతంలో ఉన్నా గూడా నీకోసం భంగం చేసుకు రావలసి వచ్చినది" అన్నారు స్వామి. నానా భక్తిపారవశ్యంలో వారికి పాదపూజ చేసి తనకు ఉత్కృష్టమైన మంత్రము ఉపదేశించమని ప్రార్థించాడు. "నీవు సంపూర్ణంగా అంతర్ముఖుడవై ఆత్మనిష్ఠలో ఉండిపోడానికి భగవంతుని అనుజ్ఞ లేదు. నీవు ప్రపంచంలో ఉండి

భక్తురాలి పాలనలో ఉంచి తీర్థయాత్రలు చేసి అత్యంత క్లిష్టమైన నర్మదానదీ ప్రదక్షిణం చేశారు. వీరు అనుసరించిన జలేది పద్ధతి అతి కఠోరం. నదీజలాలు ఎల్లప్పుడూ కనిపిస్తూండేటంత దూరంమించి పోకపోవడం నియమం. చేత దండము, భుజాన పైవస్త్రము మాత్రమే ధరించి, భిక్షనర్థించక అనాయాచితంగా లభించినది మాత్రమే తింటూ 'దిగంబరా' అన్న నామాన్ని నిరంతరం జపిస్తూ నదీ ప్రదక్షిణ పూర్తి చేసి పుణ్య తీర్థాలన్నీ దర్శించారు నానా. వారికి గిర్నార్‌లో శ్రీదత్తాత్రేయ సాక్షాత్కారము, నవనాథుల సాక్షాత్కారము ప్రాప్తించాయి. నర్మదానదీ తీరాన అనసూయాదేవి దర్శనమైనది. పూణేలో శ్రీ గుళవణి మహరాజ్, గుజరాత్‌లో శ్రీమౌనిబాబా, నారేశ్వర్‌లో శ్రీరంగావధూత, నాగపూర్‌లో శ్రీబాపూరావ్ మహరాజ్, వజ్రేశ్వరిలో భగవాన్ నిత్యానంద మహరాజ్ వంటి సిద్ధ పురుషులను గూడా నానామహరాజ్ దర్శించారు. వీరు ఎక్కువకాలం తరణిలో గడిపిన తర్వాత ఇండోర్ మహరాజైన తుకోజీ రావు హోల్కార్‌గారి ప్రార్థననుసరించి స్నేహలతాగంజ్ (ఇండోర్) లో

ఉండిపోయారు. 80 సం॥ వృద్ధులైన యీ మహనీయులు మన అదృష్టమో అన్నట్లు నేటికీ భక్తులనాదరిస్తున్నారు(అంటే ఈ వ్యాసం వ్రాసినపుడు వారు సశరీరులుగా ఉన్నారు). వీరు మహిమల ప్రదర్శననంగీకరించని నిరాడంబరులు. అయినా భగవదిచ్ఛానుసారం ఎన్నో మహిమలు వాటంతటవే భక్తులకనుభవమవుతున్నాయి.

'శ్రీ గురు చరిత్ర' అనే గ్రంథ పఠన యొక్క మహిమను తెల్పే ఒక సన్నివేశాన్ని వ్రాస్తాను. 1973 సం॥లో ప్రథమంగా పవిత్ర దత్త క్షేత్రమైన గాణ్గాపురం వెళ్ళాను. రెండవ దత్తావతారంగా 'శ్రీ గురుచరిత్ర (సంహితాయన గురుద్విసాహస్రి)' లో వర్ణించబడిన శ్రీనృసింహసరస్వతీస్వామి అక్కడ తమ అవతారకార్యం సాగించి, 15, 16 శతాబ్దాలలో తమ పాదుకలనక్కడ భక్తుల పూజార్థం మఠంలోవిడచి, శ్రీశైల సమీపంలోగల కదలీవనం వద్ద కృష్ణానదిలో నిర్యాణమయ్యారు. ఆ క్షేత్రంలో ఉన్న 5 రోజులూ 'శ్రీ సాయి చరిత్ర' నిత్యపారాయణ, పూజ, జప, ధ్యానాలతో గడిపాను.

**స్థూలదృష్టికి మాత్రమే నేనీచోటు విడిచినట్లు కన్పిస్తున్నా నిర్గుణమైన నా నిజరూపం సదా యిక్కడే నా పాదుకల రూపంలో ఉండి మిమ్మల్ని ఉద్ధరిస్తుంది.**

ఆ క్షేత్రాన్ని దర్శించిన వారందరూ మధ్యాహ్నం భిక్షకు వెళ్ళడం ఆచారం. గాణ్గాపురం నుండి మహాప్రస్థానం చేయనున్న శ్రీనృసింహ సరస్వతీ స్వామిని భక్తులు వారించయత్నించినపుడు ఆయన, "స్థూలదృష్టికి మాత్రమే నేనీచోటు విడిచినట్లు కన్పిస్తున్నా, నిర్గుణమైన నా నిజరూపం సదా యిక్కడే నా పాదుకల రూపంలో ఉండి మిమ్మల్ని ఉద్ధరిస్తుంది. నిత్యమూ నా మధ్యాహ్న భిక్షను శాశ్వతంగా ఇక్కడే స్వీకరిస్తాను" అని అభయమిచ్చారు. ఆ దివ్యమూర్తి ఏ రూపంలోనైనా భిక్ష స్వీకరిస్తారన్న విశ్వాసంతో నేటికీ స్థానిక భక్తులు, దర్శనార్థమొచ్చినవారూ ఒక్క రోజునైనా మహానైవేద్యం చేసి భిక్షార్థమొచ్చిన భక్తులందరికీ లేదనక యథాశక్తి భిక్ష పెడతారు. ఆ ప్రసాదాన్ని భక్తులు భిక్షగా స్వీకరిస్తారు.

ఒకరోజు భిక్ష తెచ్చుకొని ఒక మందిరం ముందు కూర్చుని తింటున్నాను. ప్రక్కనే భుజిస్తున్న ఒక మద్రాసీ నన్ను తెలుగులో పలుకరించారు. పరిచయమయ్యాక నా సందేహాన్ని వెల్లడించాను. "అన్ని శతాబ్దాల క్రితం నిర్యాణం చెందిన స్వామి యిప్పటికీ ఏదోరూపంతో భిక్ష నిజంగా స్వీకరిస్తుంటారా? భక్తులు అన్నదానమన్న ధర్మకార్యాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించడానికీ, దర్శనార్థం వచ్చిన భక్తులు భిక్షకు వెళ్ళడంలో అహంకారాన్ని త్యజించడానికి ఊరికే అలా చెప్పి యుంటారేమో!" – అని.

ఆ సాధువిలా అన్నారు. "నేను ఎన్నో సం॥లుగా ఈ క్షేత్రాన్ని దర్శిస్తున్నాను. మొదటనేనూ అలానే అనుకొనేవాడిని. కాని యిక్కడ భక్తులకు కల్గే అనుభవాలు వింటుంటే నాకది వాస్తవమన్పించి దత్తస్వామి ఏ రూపంలో భిక్షకు వస్తారో గమనించి వారి పాదాలు స్పృశించాలని నిశ్చయించుకొన్నాను. నిత్యము 'శ్రీదత్తావతారలీల' శ్రద్ధగా పారాయణ చేస్తూ, జపధ్యానాలు చేసుకొని తక్కిన సమయంలో నాడు భిక్షకు వచ్చే భక్తులను గమనించనారంభించాను. ఇలా 4,5 రోజులయ్యాక ఒకరాత్రి స్వప్నంలో యతి రూపంలో స్వామి దర్శనమిచ్చి, "నా రాక దైవరహస్యం. నన్ను గుర్తించ యత్నించవద్దు!" అని హెచ్చరించారు. అంతవరకూ దొరకని స్వామి యింకొంచెం యత్నిస్తే దొరుకుతారని మరింత పట్టుదలగా యత్నించాను. మరురోజు భిక్ష తీసుకునేముందు కృష్ణలో స్నానం చేసి ఒడ్డెక్కగానే అకస్మాత్తుగా విపరీతమైన తలనొప్పి, తీవ్రమైన జ్వరమూ వచ్చి అడుగు ముందుకు వేయలేక, దగ్గరున్న మందిరంలో వెన్నువాల్చాను. గాఢంగా నిద్రపట్టినది. మెలకువ వచ్చేసరికి మధ్యాహ్నం గం.3-30 ని.లు అయింది. విపరీతమైన ఆకలి వేస్తున్నది. జ్వరం తగ్గిపోయింది. ఆకలికి తట్టుకోలేక ఒక యింటికి భిక్షకు వెళ్ళాను. అది సమయం కాదని చెప్పారుగాని నేను, 'ఆకలిగా ఉన్నది ఏమైనా పెట్ట' మన్నాను. ఆ ఇంటి ఆసామి నన్ను పరికించి చూచి, 'ఏమి సాధువయా? తిండికోసమే ఉన్నట్లున్నావు. మధ్యాహ్నం నేనేగదా నీకు భిక్ష నిచ్చాను?' అన్నాడు. నేనారోజు భిక్షకు రాలేదని చెప్పినా వారు నమ్మలేదు. చేసేది లేక నీరు త్రాగి పూరుకున్నాను. నాటి రాత్రి స్వప్నంలో స్వామి మరలా దర్శనమిచ్చి, 'నన్ను నీవేమి పట్టుకోగలవు? నీ రూపంతో నేనే భిక్ష తీసుకు వెళ్ళాను' అన్నారు. స్వామి భక్తి, ఓరిమికి వశుడేగాని యుక్తికి కాదు. కాని ఆయన నేటికీ సజీవుడేనన్నది నా అనుభవం" అన్నారు. నాకాయన ద్వారా లభించిన సందేశమే నాడు నాకు నిజంగా ప్రాప్తించిన ప్రసాదమన్పించింది. నాటి నుండి 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేయాలని తలచాను గాని, నాకు ఆ గ్రంథం ఆంధ్ర, ఆంగ్లభాషలలో లభ్యం కాలేదు. తర్వాత పైన సందేశమంతటి అద్భుత రీతినే శ్రీవాసుదేవానంద సరస్వతిస్వామి సంస్కృతీకరించిన 'ద్విసాహస్రీ గురుచరిత్ర' లభించడంతో దానిని 'శ్రీ గురు చరిత్ర (సంహితాయన గురుద్విసాహస్రి)' అన్న గ్రంథంగా అనువాదం చేయించి పారాయణ చేసుకొంటున్నాను.

---



# శ్రీ సాయి సచ్చరిత్ర



**మరాఠీ మూలం: శ్రీ హేమాద్పంతు** **నవంబర్ సంచిక తరువాయి**

**స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ** అధ్యాయం - 51

శ్రీ గణేశాయ నమ:, శ్రీ సరస్వత్యై నమ:, శ్రీ గురుభ్యోన్నమ:,

శ్రీ కులదేవతాయై నమ:, శ్రీ సీతారామచంద్రాభ్యాం నమ:, శ్రీ సద్గురు సాయినాథాయ నమ:



ఫలహారాదులు పూర్తయిన తర్వాత దాసగణు బృందం తిరిగి రైల్వేస్టేషనుకు చేరుకున్నారు. పెట్టెలో ఎక్కి కూర్చున్న తర్వాత దాసగణుకు స్వామి ఇచ్చిన కొబ్బరికాయ విషయం గుర్తుకువచ్చింది(151). శిరిడీ సమీపిస్తున్న కొద్దీ అతనికి కంగారు ఎక్కువగా సాగింది. కారణం వాసుదేవానంద స్వామి సాయిబాబాకు ఇవ్వమని యిచ్చిన కొబ్బరికాయను పొరపాటున తాము అటుకులలో కలుపుకొని తిన్నారని తెలిసింది(152). అది తెలిసిన దాసగణుకు భయంతో శరీరం కంపించసాగింది. మహాత్ముని పట్ల అపరాధం జరిగినందుకు అతనికెంతో బాధ కలిగింది(153). అతడిలా చింతించాడు.'అయ్యో! నేనెంత పాపాన్ని మూట గట్టుకున్నాను! స్వామి శాపం నాకు తప్పక తగిలి తీరుతుంది. స్వామి ఆజ్ఞానుసారం చేస్తానని మాట యిచ్చాను. అవి వట్టి మాటలే అయ్యాయి(154). ఇప్పుడు ఆ కొబ్బరికాయ లేదు. బాబాకు ఇప్పుడు నేనేమి యివ్వగలను? వారికి ఏమని చెప్పను? నా ముఖమెలా ఆయనకు చూపించగలను?(156). సాయిబాబా చరణాలకు సమర్పించవలసిన కొబ్బరికాయను ఫలహారం చేసామే! సత్పురుషుని పట్ల చేయకూడని అపరాధం చేసాను'(157). 'బాబా కొబ్బరికాయ ఏది? అని అడిగితే ఏం చెప్పాలి? మనమందరమూ తలదించుకోవలసి వస్తుంది.'అని అందరూ ఎంతో బాధపడ్డారు(158). కొబ్బరికాయ లేదని చెప్పడానికి సిగ్గువేస్తుంది. అలాగని అబద్ధం చెప్పడానికి వీలు లేదు. కారణం బాబా సర్వసాక్షులు. కనుక ఆయనకు జరిగినది చెప్పాలనుకున్నాడు దాసగణు(159).

ఆ బృందమంతా శిరిడీ చేరి శ్రీసాయిబాబా దర్శనం చేసుకున్నారు. ఆయన దర్శనంతో వారెంతో ఆనందించారు. వారి చేతులు ఆనందాశ్రువులతో నిండిపోయాయి. వారి మనస్సులు శాంతిని పొందాయి(160). మనము తంతితీగెలు లేకుండానే సందేశాలను పంపుతాము. వైజ్ఞానిక పరంగా ఎంతో సాధించామని గర్వపడుతుంటాము(161). వాటికోసం ఎంతో డబ్బు ఖర్చుపెట్టి 'వైర్‌లెస్' స్టేషన్లను ఏర్పాటు చేసుకోవలసి వుంటుంది. కానీ మహాత్ములకు ఇటువంటి సాధనాలు ఏవీ అవసరం వుండవు. వారు మనస్సుతోనే సందేశాలను పంపించగలరు, స్వీకరించగలరు(162). వాసుదేవానంద స్వామి సాయిబాబాకు పంపిన కొబ్బరికాయ విషయం ఏ తంతులూ లేకుండానే సాయికి అందింది(163). దాసగణు తమను దర్శనం చేసుకోగానే సాయిబాబా తమంతటతామే యిలా అన్నారు: "నా సోదరుడు ఇచ్చిన వస్తువును నాకు తెచ్చియివ్వు!" (164). బాబా మాటలు వినగానే దాసగణు ఖిన్నుడయ్యాడు. వెంటనే అతడు బాబా పాదాలు పట్టుకుని యిలా అన్నాడు:"బాబా! ఏమని చెప్పను? క్షమించమని మిమ్మల్ని ప్రార్ధించడం తప్ప వేరు దారి లేదు(165). స్వామి యిచ్చిన కొబ్బరికాయను గుర్తుపెట్టుకుని మరీ తెచ్చాను. కానీ త్రోవలో ఆకలి తీర్చుకోవడానికి కాలువ దగ్గరకు వెళ్ళినప్పుడు అందరికీ మరుపు వచ్చింది(166). అక్కడ కారపు అటుకులు తింటున్నపుడు ఆ కాయను కొట్టి అటుకులలో కలుపుకుని అందరమూ ఫలహారం చేసాము. అందుకని ఆ కాయకు బదులుగా మరొక కొబ్బరికాయను నేనిప్పుడు మీకు సమర్పించుకుంటాను. దయతో స్వీకరించవలసినది"(167).

ఇలా ప్రార్ధించి అతడు కొబ్బరికాయను తీసుకురావడానికి లేవబోయాడు. వెంటనే బాబా అతని చేయి పట్టుకుని ఆపారు(168). అప్పుడతడు బాబాతో మళ్ళీ యిలా అన్నాడు: "బాబా! నాకు తెలియకుండానే నేను విశ్వాసఘాతకుణ్ణి అయినాను.మీరు కరుణామయులు. దయతో నన్ను క్షమించండి. నేను ఘోర అపరాధమే చేసాను(169). వాసుదేవానంద స్వామికిచ్చిన మాట పాటించకుండా మీకు అర్పించవలసిన ఫలాన్ని నేను తిన్నాను. నేను చేసిన ఈ అపరాధానికి నిష్కృతి లేదు(171)." ఈ మాటలు విని బాబా నవ్వుతూ యిలా అన్నారు:" బాధ్యతగా కాపాడలేనివాడివి అసలు ఆ కొబ్బరికాయను ఎందుకు తీసుకున్నావు?(172). నీవు ఆ వస్తువును నాకు తెచ్చి

యిస్తావని నా సోదరుడు నీ మీద విశ్వాసముంచినందుకు ఫలితం యిదేనా?(173). అందువలన నా సోదరుని కోరిక నెరవేరలేదు కదా! ఆ కొబ్బరికాయకు బదులుగా నీవు ఎన్ని కొబ్బరికాయలు తెచ్చి ఇచ్చినా నా సోదరుడు ఇచ్చిన కాయతో సాటికావు సుమా!(174). అయినా జరిగిందేదో జరిగిపోయింది. దాని గురించి యిప్పుడు చింతించడమెందుకు?(175). అయినా నా సోదరుడు నీకు కొబ్బరికాయ యివ్వడం నా సంకల్పమే. నా సంకల్పప్రకారమే మీరు ఆ కొబ్బరికాయను తిన్నారు. అనవసరంగా కర్తృత్వాన్ని ఎందుకు నీపై వేసుకుంటావు?(176). నేను కర్తను అనే అహంకార బుద్ధితో నేను అపరాధిని అని అనుకుంటున్నావు. నిరహంకార భావంతో వున్నట్లయితే నీ ఆందోళన దూరమవుతుంది(177). పుణ్యపాపాల యొక్క ఫలితం సమానమే. కాబట్టి కర్మల పట్ల కర్తృత్వ భావాన్ని విడచి నిరభిమానంతో ప్రవర్తించు(178). నిజానికి నీవు నన్ను కలుసుకోవాలన్న నా సంకల్పం వలన నా సోదరుడు ఆ కొబ్బరికాయను నీ చేతికివ్వడం జరిగింది. ఈ మట పరమ సత్యం(179). మీరు నా బిడ్డలే కదా! మీరు ఆరగించిన ఆ కొబ్బరికాయ నాకు సమర్పించనట్టే. అది నాకు అందినట్టేనని భావించు"(180).

బాబా చెప్పిన ఈ మాటలను విన్న తర్వాత దాసగణు మనసులోని బాధ నెమ్మదిగా తగ్గి మనసు శాంతించింది(181). కొబ్బరికాయ పోవడం అనే మిషతో బాబా చేసిన బోధతో ఆ బృందమంతా సమాధానపడ్డారు. వారి మనసులు శాంతిని పొందాయి(182). బాబా చేసిన లీలల యొక్క సారాంశం యిదే. మానవుని యొక్క ప్రవృత్తి ఎంతగా నిరహంకారమవుతుందో అంతగా వారి యొక్క పారమార్థికత వృద్ధి చెంది వారు సులభంగా భవసాగరాన్ని దాటగలరు(183).

ఇప్పుడు మూడవ భక్తుని యొక్క అపూర్వమైన, మధురమైన అనుభవాన్ని విన్నట్లయితే బాబా యొక్క సాటిలేని వైభవము, ఆయన యొక్క అపారమైన సామర్థ్యము అవగతమవుతాయి (184). బాంద్రా తాలూకాలోని బాంద్రా పట్టణ సమీపంలో 'శాంతాక్రూజ్' అనే నగరముంది. ఆ నగరంలో హరి భక్తులైన 'దురంధర్' కుటంబముండేది(185). దురంధర్ సోదరులందరూ మహాత్ముల పట్ల భక్తి కలిగి వుండేవారు. వారికి శ్రీరాముని యందు దృఢతర భక్తి, రామనామం పట్ల ఎంతో ప్రీతి వుండేవి. నిరంతరం వారు ఆ ధ్యాసలోనే వుండేవారు(186). వారి పిల్లలు గూడ సత్ప్రవర్తన కలిగి వుండేవారు. స్త్రీల ఆచరణ గూడ ఎంతో ఉత్తమంగా వుండేది. వారెంతో సుగుణవంతులు(187). ఆ సోదరులలో ఒకడైన బాలారాం విఠలుని భక్తుడు. అతడెన్నో పుణ్యకార్యాలు చేసి ప్రసిద్ధుడైనాడు. అతనికి రాజ దర్బారులో ప్రత్యేక స్థానముండేది. అతడందరికీ ప్రీతిపాత్రుడు(188). సం॥ 1878లో ఫిబ్రవరి 19వ తేదీన ఒక రామ భక్తుని యింట ఇతడు పుత్రునిగా జన్మించాడు(189). పాఠారే ప్రభు జాతికి చెందిన ప్రసిద్ధ గౌరవనీయ వంశంలో బొంబాయిలో యితడు జన్మించాడు(190).

ఇతడు పాశ్చాత్య విద్యనభ్యసించి న్యాయవాది వృత్తిని చేపట్టాడు. తత్త్వజ్ఞానంలో నిష్ణాతుడు, గొప్ప విద్వాంసుడుగా కీర్తి గడించాడు(191). ఇతనికి పాండురంగని యందు అనన్యభక్తి, పారమార్థికత పట్ల ఎంతో ఆసక్తి వుండేవి. ఇతని తండ్రి ఆరాధ్యదైవం శ్రీరాముడు(192). ఇతని సోదరులంతా పట్టభద్రులే, ధర్మప్రవర్తనులే. అయినప్పటికీ బాలారామ్ మాత్రం గొప్ప సంస్కారవంతుడు(193). అతడు కుశాగ్రబుద్ధి, నిర్మలమైన విచారసరళి, సత్ప్రవర్తనగలవాడు, సదాచారసంపన్నుడు(194). ఇతడు సమాజసేవ ఎంతగానో చేసాడు. సమాజం గూర్చి స్వయంగా రచనలు గూడ చేసాడు. తాను స్వీకరించిన బాధ్యతలన్నీ పూర్తయిన తర్వాత పరమార్థాన్ని సాధించడానికి సంకల్పించాడు(195). ఆధ్యాత్మిక విషయంలో గూడ అతడు ఎంతో పురోగతిని సాధించాడు. జ్ఞానేశ్వరీ భగవద్గీతను పఠించి అందులో ఎంతో ప్రావీణ్యాన్ని సంపాదించాడు. ఆధ్యాత్మవిషయంలో గూడ గొప్ప పేరు పొందాడు(196). అతడు సాయికి పరమభక్తుడు. ఇతడు చిన్న వయసులోనే సం॥1925, జూన్ నెల తొమ్మిదవ తేదీన విఠలునిలో ఐక్యమయ్యాడు(197,198).

సం॥1912 ఏప్రిల్ లో ఒక శుభదినాన దురంధర్ సోదరులకు సాయి దర్బారులో ప్రవేశించే భాగ్యం కలిగింది(199). అంతకు ఆరునెలల ముందే అతని జ్యేష్ఠ సోదరుడైన బాబుల్‌జీ వామనరావుతో కలసి శిరిడీ వెళ్ళి సాయిబాబా దర్శనం చేసుకుని ఆనందంతో తిరిగి వచ్చాడు(200). అతని ద్వారా సాయిబాబా గూర్చి విన్న బాలారామ్‌కు సాయిని దర్శించాలన్న కోరిక కలిగింది. సోదరులందరితో కలిసి అతడు శిరిడీ బయలుదేరాడు(201). వారు యింకా శిరిడీ చేరనేలేదు. శిరిడీలో బాబా అక్కడవున్న భక్తులతో యిలా అన్నారు: "ఈ రోజు నా దర్బారుకు చెందిన వారు చాలామంది వస్తున్నారు"(202). దురంధర్ సోదరులు వచ్చిన తరువాత అక్కడ వున్నవారు బాబా అన్న మాటలును వారితో చెప్పారు. వారెంతో సంతోషించి,"మేము వస్తున్నట్లు ఎవరికీ కబురుగూడ చేయలేదు, మరి బాబాకు ఎలా తెలిసింది?" అని బాబా సర్వజ్ఞతకు వారెంతో ఆశ్చర్యపోయారు(203).

- సశేషం



# శ్రీ దత్తలీలామృతము

## (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర)



నవంబర్ సంచిక తరువాయి

- శ్రీమతి శ్రీదేవి



ఆ గ్రామ ప్రజలకు కొంతకాలము నుండీ ఒక విచిత్రమైన సంకటము దాపురించింది. ముఖ్యంగా ఆ పరిస్థితికి ఆ గ్రామములోని స్త్రీలందరూ తీవ్రమైన బాధలకు లోనవసాగారు. ఈ కష్టాలకు కారణం ఆ ప్రాంతంలో సంచరించే ఒక మగ పిశాచి. వాడు వెనుకటి జన్మలో ఝుంటిగుడు అనే ఒక బ్రాహ్మణ బ్రహ్మచారి. ఆ జన్మలో వాడు తీవ్రమైన కామాతిరేకముతో చెడ తిరిగి, చచ్చి పిశాచమైనాడు. ఆ ప్రాంతంలో సంచరిస్తూ స్త్రీలు కంటపడితే చాలు, వారి వెంటపడి బాధిస్తుండేవాడు. ఇండ్లలో గానీ, పొలములలో గాని స్త్రీలు ఒంటరిగా కనిపిస్తే రకరకములయిన మనుష్య రూపములతో వారి వెంట పడుతూ క్రూరముగా వారిని వేధించసాగాడు. గ్రామ ప్రజలు ఎంతో గొప్ప గొప్ప మాంత్రికులను పిలిపించి వాడిని బంధించాలని ఎన్నో ప్రయత్నాలు చేశారుగానీ, ఎటువంటి మంత్ర తంత్రాలతోనూ ఆ మాంత్రికులు ఝుంటిగుడిని లొంగతీయలేకపోయారు. ఆ మాంత్రికులపైననే వాడు తిరగబడటంతో ఎవ్వరూ వాడిని ఏమీ చేయలేకపోయారు. దానితో వాడు మరింత పెచ్చురిల్లి, ఎదురు లేకుండా విజృంభించి స్త్రీలను బాధించ సాగాడు. ఆ ఝుంటిగుడి దృష్టి కొత్తగా కాపురమునకు వచ్చిన విశాలాక్షి పై పడింది. అది మొదలు వాడు ఏమరక ఎప్పుడెప్పుడు అవకాశం లభిస్తుందా అని ఎదురు చూడసాగాడు. వాడి దృష్టి రాత్రింబగళ్ళూ విశాలాక్షి పైనే వుండేది. ఆమె ఒంటరిగా ఎప్పుడు దొరుకుతుందా అని వేయికళ్లతో ఎదురుచూస్తున్న ఝుంటిగుడు, కుండిలుడు ఊరు విడచి వెళ్లటం, విశాలాక్షి యింట్లో ఒంటరిగా వుండటం గమనించి, ఆమెను లోబరచుకొనేందుకు మంచి అవకాశం దొరికిందనుకొంటూ తెగ సంబరపడిపోయాడు. కుండిలుడు ఊరు విడచి వెళ్లిన రోజు సాయంత్రం కుండిలుని రూపముతో ఝుంటిగుడు విశాలాక్షి యింటికి వచ్చి తలుపు తట్టాడు. తలుపు తీసిన విశాలాక్షి ఆశ్చర్యపోయింది. భర్త రూపంలో వున్న ఝుంటిగుడిని చూసి తన భర్తయేనని భావించిన విశాలాక్షి "అప్పుడే వచ్చేశారా? వెళ్లిన పని పూర్తయిందా?" అని అడిగింది. అందుకు సమాధానంగా ఆ దుర్మార్గుడు విశాలాక్షితో "నేను ఎవరికోసమైతే వెళ్తున్నానో, ఆ వ్యక్తి మార్గమధ్యంలో నాకెదురుపడి, తానొక ముఖ్యమైన పనిమీద వేరొక గ్రామానికి వెళ్తున్నాననీ, కనుక నెలరోజుల తర్వాత రమ్మనీ అన్నాడు, అందుకని వెనుదిరిగి వచ్చేసాను" అన్నాడు. విశాలాక్షి వాడి మాటలు నమ్మింది. భర్తగా భావించి, వాడికి అర్ఘ్య, పాద్యములిచ్చి సంతోషంతో సకల సపర్యలు చేసింది.

అంతట, అర్ధరాత్రి సమయంలో వాడు విశాలాక్షితో క్రీడింపసాగాడు. రాక్షసబలంతో ఆమెపై బడి వాడు చేసే వికారచేష్టలకు విశాలాక్షి తల్లడిల్లిపోయింది. వాడు పెట్టే బాధలకు ఓర్వలేక ఏడుస్తూ రాత్రంతా గడిపింది. తెల్లవారింది. విశాలాక్షి అది మొదలు ప్రతిరోజూ అదే విధముగా నరకబాధలు పడసాగింది. మునుపెన్నడూ భర్త ప్రవర్తన ఆ విధముగా లేదు. రూపము చూస్తే భర్త రూపము. చేష్టలు దయ్యపుచేష్టలు. అసలు అతడు తన భర్తయేనా అనిపిస్తున్నది. ఈ పరిస్థితిలో ఎవరితో ఏమని చెప్పుకొనాలి? ఈ బాధలు ఎవరు తీర్చగలరు? అని మనసులో కుమిలిపోతూ కాలం గడుపసాగింది. అలా నెలరోజులు

గడిచిపోయాయి.

ఒకనాడు కుండిలుడు యింటికి వచ్చాడు. అతడిని చూసిన విశాలాక్షి నిర్ఘాంతపోయి, చేష్టలుడిగి, నోటమాటరాక బొమ్మవలె నిలబడిపోయింది. కుండిలుడు ఆమెను వింతగా చూస్తూ, "ఏమిటలా చూస్తున్నావు? మాట్లాడవేమి? పలుకరించవు, కాళ్లు కడుగ నీళ్లు యివ్వవు? కొయ్యబొమ్మ లాగ నిలబడి పోయావేమిటి? ఆ వెర్రిచూపులేమిటి? నీకేమైనా దయ్యమేదైనా ఆవహించిదా ఏమిటి?" అన్నాడు. విశాలాక్షి భయంతో తడబడుతూ, "మీరు... మీరు ... వెళ్లినరోజు సాయంత్రమే తిరిగి వచ్చారుగా?" అని అన్నది. ఆమె అలా అంటూండగానే లోపలనుండీ ఝుంటిగుడు వచ్చి , "ఎవడవురా? నా వేషంలో వచ్చావు?" అని పెద్దగా అరవసాగాడు. ఝుంటిగుడిని చూసి ఆశ్చర్యపోయిన కుండిలుడు "ఎవడవురా నువ్వు? నా వేషంలో నా యింట్లో వున్నావు?" అంటూ గట్టిగా కేకలు వేయసాగాడు. అలా వారిరువురూ ఒకరిపై ఒకరు అరుచుకొంటూ, కొట్టుకుంటూ, తిట్టుకుంటూ వుండగా ఆ గొడవకు యిరుగు పొరుగు వారంతా అక్కడికి చేరారు. కొద్ది సేపటికి వారికి విషయం పూర్తిగా అర్థమైంది కానీ, యిరువురు వ్యక్తులూ రూపము, స్వరము, భాష అన్ని విధములా ఒకే రకంగా వుండటంతో దొంగ ఎవరో, దొర ఎవరో తెలుసుకోలేకపోయారు. విశాలాక్షిదీ అదే పరిస్థితి. అయితే ఊరి నుండి తిరిగి వచ్చిన వాడే తన భర్త అని తెలిసినప్పటికీ యిద్దరూ ఒకే చోట ఒకే రకంగా వుండటంతో ఆమె తన భర్తను గుర్తించలేక, భయంతో గజగజా వణికిపోతూ ఏడ్వసాగింది. అప్పుడు ఊరిలోని వృద్ధస్త్రీలు ఆమెకు ధైర్యము చెప్పి, ఊరడించి, ప్రక్కకు తీసుకునిపోయి, ఆమెతో "వీళ్లిద్దరిలో నీ భర్తను నువ్వు గుర్తించలేవా?" అని అడిగారు. ఆమె "ఊరి నుండి వచ్చిన వారు మావారే. ఇంట్లో వున్న వాడు రాక్షసబలంతో వున్నాడు. వాడు నా భర్త కాదు. కానీ యిద్దరూ ఒకే చోట వున్నారు కనుక గుర్తించలేక పోతున్నాను" అంటూ ఏడ్చింది.

అప్పుడా వృద్ధస్త్రీలు తమలో తాము చర్చించుకోసాగారు: "ఈ ప్రాంతంలో సంచరిస్తున్న కామపిశాచి వున్నాడే, వాడే యిలా వచ్చి వుంటాడేమో!" అన్నది ఒక స్త్రీ. "అవునవును! కొంతకాలం క్రిందట మరణించిన బ్రాహ్మణ బ్రహ్మచారి దయ్యమై తిరుగుతున్నాడుగా, వాడే వీడయివుంటాడు" అన్నది మరొక స్త్రీ. మరొకామె "ఈ పరిసరగ్రామాలలో ఒంటరిగా కన్పించే స్త్రీల వెంటపడి పీడించే ఆ పిశాచియే యిప్పుడీ కుండిలుని వేషంలో వచ్చి వుంటాడు." అన్నది. "విశాలాక్షి ఒంటరిగా యింట్లో వున్నది కదా! ఆమె కోసం కుండిలుడింట్లో చొరపడ్డాడు. సందేహంలేదు. ఆ కామ పిశాచే వీడు" అని మరొక స్త్రీ అన్నది.

"ఎందరెందరు మాత్రికులకూ వీడు లొంగలేదు. ఇప్పుడు వీడికి కాలం మూడినట్లుంది. కుండిలుని రూపంలో మన చేతికి చిక్కాడు. ఈ అవకాశం పోగొట్టుకొనకుండా ఎట్లాగైనా వీడిని మట్టుపెట్టే దారి చూడాలి" అన్నది ఒకామె. "వీడిని అంతంచేసే మహనీయుడు విష్ణుదత్త సోమయాజియే. ఆయనే అందుకు సమర్థుడు" అని మరొకామె అన్నది.

–ఇలా వితర్కించుకొని, ఊరి పెద్దలతో కూడా రహస్యముగా సంప్రదించి, అందరూ కలసి ఝుంటిగుడు, కుండిలుని వద్దకు వెళ్లి, వారితో యిలా అన్నారు, "అయ్యా! మీరిద్దరూ రూపురేఖలలో ఒకే విధముగా వున్నారు. అందువలన మీ తగవును మేము తీర్చలేము. కనుక పెద్దల వద్దకు వెళ్దాము"–ఇలా చెప్పి, వారిరువురినీ విష్ణుదత్తసోమయాజి వద్దకు తీసుకొని వెళ్లారు. విష్ణుదత్తునికి విషయమంతా వివరించారు. విశాలాక్షి విష్ణుదత్తుని పాదాలపై బడి పెద్దగా ఏడ్వసాగింది. అప్పుడా మహాత్ముడు ఆమెను ఓదారుస్తూ "అమ్మా! ఏడవకు తల్లీ! నీ సమస్యను తప్పకుండా తీరుస్తాను. నీవు చింతించవలసిన పని లేదు. నాపై నమ్మకముంచి నువ్వు నిశ్చింతగా వుండు. ఏమీ భయంలేదు" అంటూ ధైర్యం చెప్పాడు.

కుండిలుని, ఝుంటిగుని చూడటంతోనే విష్ణుదత్తునికి విషయం పూర్తిగా అర్థమైంది. ఆ మహనీయుడు పిశాచి అయిన ఝుంటిగుని వెంటనే గుర్తుపట్టాడు. కాని, అతడు ఎప్పటివలెనే 'శాస్త్రపద్ధతిలో లౌకిక ప్రజ్ఞను అనుసరించి, సమస్య పరిష్కారము చేసినట్లుగా ప్రజలకు కన్పించాలి గాని, తన ప్రజ్ఞను, మహిమను వ్యక్త పరచకూడదు' అని భావించి, బ్రహ్మ రాక్షసుని బంధించే ఉపాయం మనసులో ఆలోచించుకొన్నాడు.

ఇది యిలా వుండగా యీ విచిత్రమైన సమస్యను గురించి విని చుట్టుప్రక్కల గ్రామాల నుండీ కూడా ప్రజలు ఎందరో విష్ణుదత్తసోమయాజి యింటి ముందు గుమిగూడారు. జనులందరూ ఈ సమస్యను యీ మహాత్ముడు ఏ విధంగా పరిష్కరిస్తాడో చూడాలన్న కుతూహలంతో ఎదురు చూడసాగారు.

అప్పుడు ప్రజలందరూ వింటుండగా, విష్ణుదత్తుడు

ఘుంటిగుడు, కుండిలుడు–యిద్దరినీ ఉద్దేశించి యిలా అన్నాడు. "విశాలాక్షి భర్త అయిన కుండిలుడను నేనే అంటే నేనే అని మీరిద్దరూ కూడా నొక్కి చెపుతున్నారు. విచిత్రమేమిటంటే ప్రపంచంలో మనిషిని పోలిన మనుష్యులను చాలా మందిని మనం చూస్తూ వుంటాము గానీ వారిలో కూడా పోలికలలో ఎంతో కొంత తేడా కన్పిస్తుంది. కానీ యిక్కడ మీరిద్దరి వయస్సు,రూపము, కంఠస్వరము, రంగు, నడక, చేష్టలు, భాష–అన్నీ అచ్చు గుద్దినట్లు ఒకే రకంగా వుండటం, ఏ కొంచెము కూడా భిన్నంగా లేకపోవటం చాలా ఆశ్చర్యంగా వున్నది. చివరకు భార్య విశాలాక్షి కూడా తన అసలు భర్త మీరిరువురిలో ఎవ్వరో గుర్తుపట్టలేనంతగా మీరిద్దరూ ఒకే విధంగా కన్పిస్తున్నారు. అటువంటప్పుడు మేము మాత్రము ఎలా గుర్తించగలము? అది అసాధ్యమైన పని. కాబట్టి మీ యిద్దరినీ కొంచెము పరీక్షించాల్సి వున్నది. ఇందుకు మిమ్మల్ని నన్ను క్షమించమని కోరుతున్నాను. దయచేసి యీ పరీక్షలకు మీరిద్దరూ అంగీకరించి, నాకు సహకరించవలసి వున్నది".

ఆ మాటలు విని ఆ యిద్దరూ "మీరు ఎలాంటి పరీక్షలు పెట్టినా మాకు సమ్మతమే. ఎలాగైనా మాకు న్యాయం చేస్తారనే నమ్మకంతోనే కదా, మీ వద్దకు వచ్చాము!" అన్నారు. విష్ణుదత్తుడు సంతోషించి వారిద్దరినీ తన వద్దకు పిలిచి, ఒకని నుదుట 'క' అను అక్షరాన్ని సమంత్రకముగా ముద్రించాడు. రెండవ వాని ఫాలభాగాన 'ద' అనే అక్షరాన్ని అదే విధంగా ముద్రించి యిద్దరినీ దూరంగా పొమ్మని పంపించి వేశాడు. ఆ తర్వాత విష్ణుదత్తుడు 'క' అని ముద్రించ బడిన వ్యక్తిని తన వద్దకు పిలిచి యిలా అడిగాడు–

"అయ్యా! నీవే అసలైన కుండిలుడవు అని నిర్ధారించవలెనంటే నేను కొన్ని ప్రశ్నలు వేయవలసి వున్నది. వాటికి నీవు సరైన సమాధానాలు చెప్పాలి."

"అడగండి. ఎలాంటి ప్రశ్నలైనా వేయండి, నాకేమీ అభ్యంతరం లేదు." అన్నాడు, 'క' అనే వ్యక్తి.

అవుడు విష్ణుదత్తుడు "మీ యింటిలో పాత సామానులు ఏమేమి వున్నాయి? మీరిరువురూ ధరించే వస్త్రాలు ఎలాంటివి? ఏఏ రంగులలో ఎన్నెన్ని వున్నాయి? విశాలాక్షి శరీరలక్షణములు ఏమిటి?" అని అడిగాడు.

అతడు చెపుతున్న సమయంలో ఆ వివరాలన్నింటినీ వ్రాయసగాండ్ల చేత కాగితాలపై వ్రాయించాడు విష్ణుదత్తుడు. అటు తర్వాత అతనిని పంపించి వేసి,'ద' అనే వ్యక్తిని పిలిచి అతని సమాధానాలను వ్రాయించి అతనిని పంపివేశాడు.

ఆ తర్వాత విశాలాక్షిని పిలిచి ఆమెను కూడా అదే విధముగా ప్రశ్నించి, ఆమె చెప్పిన వివరాలన్నీ వ్రాయించాడు విష్ణుదత్తుడు. సభలోని పెద్దలను పిలిచి, వారందరితో కలసి వారు ముగ్గురూ చెప్పిన వివరాలను గురించి రహస్యముగా చర్చించిన తర్వాత అందరూ కలసి ఒక నిశ్చయానికి వచ్చారు.

ఇక రెండవ పరీక్ష చేయదలచి విష్ణుదత్తుడు సభాముఖముగా కుండిలుడు, బ్రహ్మరాక్షసులనుద్దేశించి నవ్వుతూ యిలా అన్నాడు–

"చూడండి, ఈ పట్టణము అయిదు క్రోసుల వైశాల్యం కలిగి వున్నది. మీరు ఈ పట్టణము చుట్టూ ప్రదక్షిణము చేసి రావాలి. అంతేకాదు, మీరు ప్రదక్షిణ చేసే మార్గంలో వున్న దేవాలయాలను, ఆ ఆలయంలోని దేవతలను, ఆ దేవతా లక్షణములను వివరంగా చెప్పవలసి వుంటుంది. ఎవరు ముందుగా ప్రదక్షిణ పూర్తి చేసి వస్తారో వారు గెలిచినట్లు ప్రకటిస్తాము". ఈ మాటలు వింటూనే యిరువురూ పరుగెత్తి ప్రదక్షిణ చేయనారంభించారు. కొంచెం సేపటికి వారిరువురిలో ఒకడు తిరిగి వచ్చాడు. వస్తూనే "నేనే ముందుగా వచ్చాను. కాబట్టి విశాలాక్షి నాకే స్వంతం" అంటూ అరవ సాగాడు. పెద్దమనుష్యులు అతనిని మార్గమందలి దేవతలను, దేవాలయములను గూర్చిన వివరాలను అడిగి వ్రాసి వుంచారు. అతడే ముందుగా వచ్చినట్లుగా కూడా వ్రాశారు.

రెండవ వాడు వచ్చేసరికి మధ్యాహ్న సమయం దాటిపోయింది. నీరసించిన ముఖంతో, ఎంతో అలసటతో కాళ్ళీడ్చుకొంటూ వచ్చిన అతడిని చూసి జాలిచెందారందరూ. పెద్దలు అతడు చెప్పిన దేవాలయముల, దేవతల గురించిన వివరములన్నీ కాగితములపై వ్రాయించారు. అది అలా వుండగా వీరిరువురి విషయంలో కొందరు పెద్దలు అభ్యంతరం చెప్పారు.

"ఇద్దరూ పట్టణాన్ని చుట్టి వచ్చారు. దేవాలయాల గురించి, ఆలయాలలోని దేవతా విగ్రహాల లక్షణాల గురించి యిద్దరూ ఒకే విధంగా చెప్పారు. ఇద్దరు చెప్పిన వివరాలు సరిగానే వున్నాయి, అలాంటప్పుడు ఎవరు గెలిచారో, ఎవరు ఓడిపోయారో అన్నది చెప్పటం కష్టం. ఎందుకంటే ఒకడు నడువగలవాడుంటాడు. మరొకడు నడువలేనివాడుంటాడు. ముందుగా వచ్చిన వాడే గెలిచాడనటం న్యాయం కాదు". అని వారు గట్టిగా వాదించారు. విష్ణుదత్తుడు వారి మాటలను న్యాయబద్ధమైనవిగా నిర్ణయించి, మూడవ పరీక్షను యిలా

ప్రకటించాడు–

"ఈ వూరికి దక్షిణదిశగా వున్న సహ్యాద్రి పర్వతము చుట్టూ తిరిగి వచ్చి కొండపై తపస్సు చేసుకూంటూ వుండే యోగుల, సిద్ధులను దర్శించి రావాలి. వారి వారి పేర్లు, గోత్రములు మొదలైన వివరములన్నీ తెలుసుకొని వచ్చి చెప్పాలి. ఎవరైతే ముందుగా వస్తారో వారే విజేతగా ప్రకటిస్తాము" అన్నాడు విష్ణుదత్తుడు. వెంటనే యిద్దరూ గిరి ప్రదక్షిణమునకై వెళ్లారు. 'ద' అనేవాడు కొద్దినిముషాలలోనే తిరిగి వచ్చి, యోగీశ్వరుల వివరాలన్నీ చెప్పగా వ్రాయసగాండ్రు వానినన్నింటినీ వ్రాసి వుంచారు. అయితే, పాపము 'క' అనేవాడు వచ్చేసరికి రాత్రిజాముకాలం గడిచిపోయింది. ఆతడు ఉసూరుమంటూ ఎంతో నీరసముగా కాళ్లీడ్చుకొంటూ, ముఖము వ్రేలాడవేసుకొని విష్ణుదత్తుని ఎదుటకు వచ్చి, "కొండ చుట్టూ తిరిగి వచ్చాను. నాకు యే ఒక్క యోగీ కన్పించలేదు" అంటూ నేలపై చతికిలబడి, స్పృహ తప్పి పడిపోయాడు. విష్ణుదత్తుడు అతని ముఖముపై నీళ్ళు చల్లి లేవదీసి కూర్చుండ బెట్టి, మంచినీళ్ల త్రాగించి, అతడు తేరుకున్న తర్వాత యిలా అన్నాడు.

"ఇంక చిట్టచివరి పరీక్ష ఒకటి వున్నది. ఇప్పటికి మాకు సత్యము తెలిసింది." అంటూండగానే సభలోని సభ్యులు గట్టిగా కరతాళధ్వనులు చేశారు. అది తనను ప్రశ్నించినట్లుగా భావించిన 'ద' అనేవాడు "చేయండి, చేయండి. ఆ పరీక్ష కూడా త్వరగా చేయండి" అంటూ గట్టిగా అరచాడు.

అప్పుడు విష్ణుదత్తుడు ఒక పెద్ద సీసాను తెప్పించాడు. ఆ సీసాను వారిరువురికీ చూపుతూ, "దీనిలో దూరి, బయటకు వచ్చి, నిర్భయముగా, నిరభ్యంతరంగా విశాలాక్షిని తీసుకుని యింటికి వెళ్లవచ్చును. ఎవరూ అడ్డుచెప్పరు, ఆటంకపరచరు" అనగానే 'ద' అనే వాడు వెంటనే సూక్ష్మ రూపం దాల్చి సీసాలో చొరబడ్డారు. తక్షణమే విష్ణుదత్తుడు అతడు బయటకు రాకుండా సమంత్రకంగా సీసాకు బిరడా పెట్టి, సందులేకుండా చేసి నవ్వుతూ సభాసదులతో "దొంగ చిక్కాడు, చూశారా?" అనగానే ప్రజలందరూ సంతోషంతో గట్టిగా చప్పట్లు కొట్టారు.

కుండిలుడు, విశాలాక్షి పరుగెత్తి వచ్చి, విష్ణుదత్తుని పాదాలపై పడ్డారు. విష్ణుదత్తుడు "ఆగండి, ఆగండి, యింకా చేయవలసినది వున్నది" అంటూ వాళ్లిద్దరినీ అవతలికి పంపి, తన శిష్యుని ఒకనిని పిలచాడు. అతనితో "ఈ సీసాను తీసుకొని వెళ్లి, స్మశాన భూమిలో లోతైన గోతిలో పూడ్చిపెట్టి రమ్మని సీసానతని చేతికిచ్చి పంపివేశాడు. సభలోని ప్రజల ఆనందానికంతులేదు. సభ అంతా చప్పట్లతో మారుమ్రోగింది. అందరూ "విష్ణుదత్తసోమయాజివారికీ జై" అంటూ జయజయధ్వానాలు చేశారు.

అప్పుడు విష్ణుదత్తుడు ప్రజలతో "చుశారా, ఈ దుష్ట బ్రహ్మరాక్షసుడి దుర్మార్గ బుద్ధి ఎందరు స్త్రీలను హింసలపాలు చేసిందో? వీడివలన ఎన్నో కాపురాలు కూలిపోయాయి. నేను పెట్టిన యీ పరీక్షలలో రాక్షసశక్తికీ, మానవ శక్తికీ గల తేడా ఎంతటిదో అర్థమైంది. అది చాలు. నేటితో ఆ దుష్ట రాక్షసుడి పీడ విరుగడ అయింది. అంతా ఆ శ్రీదత్తాత్రేయస్వామి దయ" అంటూ, "ఇప్పటికే చాలా పొద్దుపోయింది, ఇక మీమీ గృహాలకు వెళ్లండి" అని సభ్యులందరినీ పంపివేశాడు. విశాలక్షీకుండిలులను ఆ రాత్రి తమ యింట్లోనే వుంచుకొని, స్నాన పానాదుల సమకూర్చి, వాళ్లను ఆదరించాడు. మరుసటి ఉదయం "దైవభక్తి కలిగి వుండండి, దేవతార్చనలు నిష్ఠతో సలుపుతూ, విహిత కర్మములనాచరిస్తూ సుఖముగా జీవించండి" అని చెప్పి వారిని ఆశీర్వదించి పంపాడు విష్ణుదత్త సోమయాజి.

ఈ గాధను చెప్పి బృహస్పతి ఇంద్రునితో "సురేంద్రా! **శాస్త్రము అజ్ఞానులను క్రమక్రమముగానున్నతిని పొందిస్తుంది. విషయపరిజ్ఞానమును క్రమముగా బోధిస్తూ, మంచి, చెడ్డలను తెలియజేస్తూ, శాస్త్రము వారిని నెమ్మదినెమ్మదిగా సాత్విక భావనలవైపు ప్రేరేపించి పవిత్రమైన నడవడివైపు నడిపిస్తుంది. చిట్ట చివరకు వేదాంత వాక్యములను బోధించి, అజ్ఞానమును తొలగింప జేస్తుంది. భక్తి, జ్ఞాన, వైరాగ్యములను కలిగించి ముక్తిని ప్రసాదిస్తుంది.** ఈ వాస్తవగాధలో విష్ణుదత్త సోమయాజి రాక్షస ప్రవృత్తిని, శాస్త్ర పద్ధతిన ఆ ప్రవృత్తిని అరికట్టే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రజలకు అర్థమయ్యేలాగా వివరించటం జరిగింది కదా? విష్ణుదత్త సోమయాజి యింకా ఏమేమి చేశాడో చెపుతాను, విను" అంటూ మరొక గాధను యిలా వివరించారు.

**– సశేషం**



# వార్తాలాపము

నవంబర్ సంచిక తరువాయి (సీరియల్)

## మీరాబాయికి పరమాత్మయందుగల భర్తృభావము.

ములాల్వాలారాజుగారు మరల ప్రశ్నించిరి :- మీరాబాయికి భర్తయుండెను. ఆయనను విడచి ఆమె ప్రభువును సేవించినది. ఆమెకు ప్రభువు ఎట్లు లభించెను?

స్వా. ప్ర. - బాల్యకాలమున మీరాబాయి కొందరు చెలికత్తెలతో ఆడుకొనుచుండెను. ఆడుకొనుచు ఆ చెలికత్తెలందరు తాము వరించిన ప్రియుల పేర్లను చెప్పుకొనిరి. ఒకామె తాను వరించిన వ్యక్తి పేరు ప్రతాపసింహుడనెను. మరియొక ఆమె కేసరీసింహుడనెను. ఈ విధముగనే సఖులు అందరును చెప్పిరి. మీరాబాయివంతు వచ్చెను. ఆమె తలచెను, 'అయ్యో! అందరకును భర్తలు కలరే. నాకే భర్త లేకపోయెను. నా కెందుకు లేడు?' అని ఆమె దు:ఖించెను. అప్పటికి మీరాబాయి వయస్సు ఏడు, ఎనిమిది సంవత్సరములు. ఆమె తన తల్లిదండ్రులను అడిగెను. "నా స్నేహితురాండ్రు అందరకును భర్తలు కలరు. నాకు భర్త లేరా?" తల్లిదండ్రులు నవ్వుచు మీరాబాయితోనిట్లనిరి:- "నీ భర్త గిరిధరుడే!" ఈ మాట విని మీరాబాయి చాల సంతోషించెను. అందరికంటెను నా భర్త గొప్పవాడని చెప్పుచు ప్రభుపరాయణయగు మీరాబాయి "గిరిధరా, గిరిధరా" అనుచు భక్తి యందు నిమగ్నురాలయ్యెను. ఆమె తండ్రి సర్దారు. ఆయన మీరాబాయి పెండ్లి రాణాతో చేయుటకు ప్రయత్నించెను. ఇది తెలిసికొని మీరాబాయి ఖిన్నురాలై పలికెను. "మీరు నా పెండ్లి గిరిధరునితో చేసిరి. నా భర్త గిరిధరుడే. ఇదేమిటి, ఇట్లు చేయుచున్నారు? నన్ను వ్యభిచారిణిగా చేయుచున్నారా?" అని తాను పెండ్లిచేసికొనననని పట్టుబట్టెను. తాను అవినాశియగు ప్రభువును పరిణయ మాడినందున ఇక వివాహము కూడదని పట్టు బట్టెను. ఈ విధముగ మీరాబాయి బాల్యమునుండియు ప్రభువునే భర్తగా తలచి ఆయనయందు భక్తిని కలిగియుండెను. ఆమె దృష్టిలో ప్రభువు తప్ప వేరు భర్త లేనందున భర్తృవియోగము కూడ ఆవిడకు లేదు.

అప్పుడు రాజుగారు శ్రీ ప్రకాశానందస్వామివారిని ప్రశ్నించిరి. "మరల తమరు ఎప్పుడు దయచేయుదురు?"

స్వా. ప్ర. :- నా నిర్ణయము ఏమియు లేదు. ఎప్పుడైన ఇటు వచ్చినచో తప్పక వచ్చెదను.

రాజు:- చాతుర్మాస్యములు సమీపించుచున్నవి. తమరు ఇచ్చటనే చాతుర్మాస్యములు గడిపిన బాగుండును. తమకు అనుకూలముగానున్న ఏకాంతప్రదేశమున ఏర్పాట్లు చేసెదము.

స్వా. ని. :- షిరిడియాలో ఏకాంతస్థలము లేదు. కావున వారు ఇక్కడ వుండు అవకాశము లేదు.

రాజు:- కమలేశ్వరమందిరము ఏకాంతముగా నుండునుకదా! అది వారికి అనుకూలముగానుండును.

స్వా.ని.:- కమలేశ్వరమందిరము చాలా దూరము. భిక్ష మొదలగువానికి చాలా ఇబ్బంది కలుగును.

రాజు:- దానికేమి? అక్కడనే వండించెదము. వంటమనిషిని, నౌకర్లను ఏర్పాటు చేయుదును. ఇంక లోపము ఏమి?

స్వా.ని. :- నాలుగువందల సంవత్సరములకు పూర్వము మద్రాసులో ఒక కోటీశ్వరుడైన నగరశ్రేష్ఠి ఉండెను. అతడు మహా ధనవంతుడు. కుబేరుని అవతారము అని జనులు చెప్పుకొనెడివారు. ఒకప్పుడు ఆయన ఓడ ఒకటి దారి తప్పి తిరిగి రాలేదు. అందులో 60, 70 మంది నావికులును, రత్నపరీక్షకులును ఉండిరి. మూడు సంవత్సరముల తరువాత హఠాత్తుగా ఓడ రేవునందలి సైనికుడు ఒక రాత్రి పన్నెండుగంటలకు వచ్చి మీ తప్పిపోయిన ఓడ వచ్చినదని చెప్పెను. ఆ ఓడ తప్పుడు మార్గమున ఒక ద్వీపమున చేరెను. ఆ ద్వీపమునందు రత్నపురాళ్ళు లభించెను. ఆ విధముగా విలువగల రత్నశిలలను నింపుకొని ఓడ మూడు సంవత్సరములకు మరలివచ్చెను. ఇది విని అతడు ఆనందముతో పొంగిపోయెను. ఆతడు బట్టలు వేసికొని రేవుకు చూచుటకు వెళ్లెను. ఇంతలో ఆతని గురువునకు ఈ సంగతి తెలిసెను. ఆతడు శ్రేష్ఠి ఇంటికి వచ్చెను. శ్రేష్ఠి భార్య "ఇక్కడే కూర్చొనుడు, ఇప్పుడే వచ్చెదరు" అని చెప్పెను. గురువు వెళ్లిపోవలసియుండెను. ఆయన ఒక తాటాకు తెప్పించి దానిపై "ఒక విరిగిన సూదికూడ నీతో రాదు" అని వ్రాసెను. శ్రేష్ఠి ఇంటికి వచ్చిన తరువాత ఈ తాటాకు ఇవ్వమని చెప్పి గురువు వెళ్లిపోయెను. శ్రేష్ఠి ఓడల రేవునుంచి ఇంటికి వచ్చి ధోవతిని విడచి

కౌపీనముతో స్నానము చేయ కూర్చొనెను. స్నానము చేయుచుండగా గురువుగారి తాళపత్రమును భార్య ఇచ్చెను. అది చదివి ఆ శ్రేష్ఠి వెంటనే కౌపీనముతోనే వెళ్ళిపోయెను. అచ్చటి నుండి ఆతడు సంచారము చేయుచు బదరీగిరి నగరమునకు వెళ్ళెను. అచ్చటి రాజుకూడ ఆతని దర్శనమునకు వచ్చెను. ఆయనకూడ చినిగిన బట్ట కట్టుకొని ఆతనితో తిరుగసాగెను. ఈ స్వామి కౌపీనమును మాత్రమును ధరించెడివాడు. వారు ఇరువురును ఎక్కడో ఒక చోట దుమ్ములో చెట్టుక్రింద పడియుండెడివారు. అక్కడ ఈ స్వామి 'పట్టణస్వామి' అను పేరుతో వ్యవహరించబడెడు వాడు.

మద్రాసునకు 'చెన్నపట్టణము' అను పేరు కలదు. దానిని ఆధారముగా చేసికొని ఆయనకు 'పట్టణస్వామి' అను పేరు వచ్చెను. ఆయన సన్యాసిగా మారిన పిమ్మట ఒక పద్యమునందు ఇట్లు చెప్పెను.

"సన్యాసి కుక్కవలె తినవలెను. నక్కవలె తిరుగవలెను. కుక్క ఇంటింటికి తిరిగి ఏది దొరికితే అది తిని సంతోషించును. అటులనే సన్యాసికూడ మానావమానములను లెక్కచేయకుండ ఏ భిక్ష దొరికిన, దానితోనే తృప్తిని పొందును. నక్క ప్రాణులన్నింటికంటెను ఎక్కువ జాగ్రత్త కలది. అందుచే జీవహింసచేయు ఇతర ప్రాణులు ఏవియు దానిని చంపలేవు. అటులనే సన్యాసికూడ జగత్తునందు జాగ్రత్తగా ఉండి మాయాపాశమున చిక్కుకొనరాదు.

## గౌరాంగుడు ఉచ్ఛిష్టాన్నమును ప్రేమతో భుజించెను

స్వా.ని. :- బెంగాలులో సప్తగ్రామజమీందారులగు హిరణ్యదాసుడు, గోవర్ధనదాసుడు అను ఇద్దరు సోదరులు ఉండిరి. వారిలో గోవర్ధనదాసునకు ఒక బిడ్డ పుట్టెను. ఆ ఒక్క బిడ్డతోనే ఆతడు చివరకు అమరత్వమును పొందెను. మహాత్ముడగు రఘునాథదాసునకు తండ్రియగు భాగ్యము ఆ గోవర్ధనదాసునకు కలిగెను. కుటుంబమునకు ఏకైక పుత్రుడయినందున పెదతండ్రికిని, తండ్రికిని కూడ ఆ బాలుని యందు మిక్కుటమగు వాత్సల్యము ఉండెను. బాల్యమునుండియు రఘునాథదాసుడు గంభీరుడు. వినయవిధేయతలు గలిగియుండెను. సుందరాకారుడు. రాజపుత్రుడగుటచే ఇంకను ఎక్కువగా శోభించుచుండెను. కుమారుని పండితుని చేయవలెనను తలంపుతో తండ్రి బలరామాచార్యుల వద్దకు పంపెను. ఆ రోజులలో మహాత్ముడగు హరిదాసుగారి ధర్మనిష్ఠకు ఆతడు ఎంతయో లోబడిపోయెను. వారిరువురును పరస్పరము స్నేహభావముతో నుండిరి. పెద్దవాడైన పిమ్మట రఘునాథుని మనస్సును అనంతవైభవములు ఆకర్షించలేదు. విషయభోగములు విషముతో సమానముగా తోచసాగెను. వెండి, బంగారు నాణెములను తన మార్గమునందలి కంటకములతో సమానముగా చూచుచుండెను. రాచకార్యములయందు ఆతని మనస్సు ఉండెడిది కాదు. రాఘునాథదాసుని ఈ ప్రవర్తన చూచి తండ్రికి ఎంతయో విచారముగానుండెను. అనేకవిధములగు విషయభోగములద్వారా ఆతని మనస్సును ఆకర్షించ ప్రయత్నించెను. కాని అవి అన్నియు వ్యర్థమైన పిమ్మట ఆతనికి ఒక సౌందర్యవతితో వివాహము చేసెను. రఘునాథుడు యువకుడైనందున, పరమసౌందర్యవతియగు భార్యను పొంది తన ఔదాసీన్యమును విడనాడి ఆ ప్రేమపాశమున బద్ధుడగునని తండ్రి ఆశయము. కాని తండ్రి చేసిన ఈ ప్రయత్నము నిష్ఫలమయ్యెను.

ఒకనాడు సమీపగ్రామమగు శాంతిపురమునందలి శ్రీ అద్వైతాచార్యులవద్దకు గౌరాంగప్రభువులు వచ్చిరని తెలిసికొని రఘునాథదాసు అచ్చటికి వెళ్ళుటకు అనుమతించమని తండ్రిని కోరెను.

తండ్రి చెప్పెను:- "నాయనా, నీవు ఒక్కడవే నా వంశదీపము. నీవే మాజీవితమునకు ఆధారము. మహాప్రభువుల దర్శనము చేయవద్దని నేననుట లేదు. వృద్ధుడనగు నేను నిన్ను ప్రార్థించుచున్నాను. నా తెల్ల వెండ్రుకలవైపు చూచి త్వరగా తిరిగి రమ్ము." రఘూనాధుడు చెప్పెను. "తండ్రీ! నేనేమి చేయుదును? ఎందుచేతనో ఎవరికి తెలియును? సాంసారిక కృత్యములయందు నా మనస్సు నిమగ్నమగుట లేదు. నావలన మీకు దు:ఖము కలుగరాదనియే కోరుచున్నాను. కాని నేను మాత్రము నా వశములో లేను. అయినను నేను తప్పక తమసేవకు హాజరగుదును". ఇట్లు చెప్పి రఘునాధదాసు శాంతిపురమునకు వెళ్ళెను. ప్రభువుల చరణములకు నమస్కరించి సంసారబంధమునుండి విముక్తి నొందించమని ప్రార్థించెను. ప్రభువులు చెప్పిరి. "ప్రస్తుతము ఇంటికి వెళ్ళుము. మానవునకు కలిగిన క్షణికవైరాగ్యము కష్టము తొలగినంతనే నశించును. ఇంకను కొన్ని రోజులు ఇంటిలో నుండుము. తరువాత చూడవచ్చును.

"ఎవరి గురించీ తప్పుగా మాట్లాడవద్దు."

ఇప్పుడు నేను బృందావనము వెళ్ళుచున్నాను. అక్కనుండి పూరీజగన్నాథము వెళ్ళుదును. అక్కడ నన్ను కలసికొనుము." ప్రభువుల ఈ సమాధానము రఘూనాధుని సంతృప్తిపరచెను. ఆతడు ఇంటికి మరలెను. కొన్ని దినముల తరువాత ప్రభువులు పూరీజగన్నాథము వచ్చిరను సంగతి రఘునాధునకు తెలిసెను. అంతట అక్కడకు వెళ్లి ప్రభువులను దర్శించవలెనని రఘునాధుని మనస్సు తొందరపడసాగెను. నిద్రాహారములు లేవు. ఏదోవిధముగా పూరీ వెళ్లవలెనని తలచెను. బైటకు పిచ్చివానివలె నటించెను. కొంతమంది రఘునాధదాసును గొలుసులతో కట్టమని సలహా చెప్పిరి. గోవర్ధనదాసు చెప్పెను. "నాయనలారా! రఘు పిచ్చివాడు కాడు. అతని పిచ్చి సాంసారిక బంధములను భేదించ గోరుచున్నది. అపారమగు సంపద, సౌందర్యవతియగు భార్య ఇంట నుంచలేకపోయినచో గొలుసులు ఇంటనుంచగలవా?" ఇట్లు చెప్పి రఘునాధుడు ఆజ్ఞానువర్తి అని తండ్రి ఎరిగియున్నందున నా ఆజ్ఞకాని, ఆచార్యుల ఆజ్ఞకాని లేకుండ ఇంటి నుండి బైటికి వెళ్లరాదని విధించెను. ఇంకను తండ్రికి ధైర్యము చిక్కక రహస్యముగా అతనిపై పహరా విధించెను. ఎల్లవేళలయందును ఎవడో ఒకడు అతనితో నుండెడివాడు. ఒకనాటి  సంధ్యాకాలమునందు బలరామాచార్యులు ఏదియో  పనియుండి  వచ్చిరి. మాట్లాడిన తరువాత ఇంటికి మరలిపోయిరి. రఘునాధుడుకూడ ఆయనతో వెళ్లెను. ఆ సమయమున రఘూనాధుని తండ్రిగారు ఎక్కడికో బైటికి వెళ్లియుండిరి. ఆచార్యులతోకూడ నుండుటవలన రాఘునాధుని ఎవ్వరును ఆపలేదు. కూడా ఎవ్వరును రాలేదు. మాటలు చెప్పుచు రఘునాధుడు ఆచార్యుని ఇంటివరకు వెళ్లెను. రఘునాధుడు పలికెను, "అయితే వెళ్ళుదునా?" ఆచార్యులు చెప్పిరి. "ఓహో! మాటలలో ఏమియు తెలియనేలేదు. ఇంటినుండి చాలదూరము వచ్చివేసితివి. వెళ్ళుము. వెంటనే వెళ్లి చేయదగినపనిని చేయుము." ఇది గురువాజ్ఞగా భావించి రఘునాధుడు అచ్చటినుండి తిన్నగా పూరీ వెళ్లెను. వైరాగ్యభూషణుడగు రఘునాధదాసు పూరీవచ్చి గౌరాంగ ప్రభువులచెంత నుండెను. వారి ప్రసాదమునే ఐదారురోజులవరకు తీసికొనెను. కాని ఇది తగదు అనుకొనెను. జగన్నాధుని మందిర సింహద్వారమున భక్తులు ప్రసాదమును భిక్షుకులకు పంచిపెట్టెదరు. ఇది తెలుసికొని భిక్షుకులమధ్య కూర్చొని దొరికినదానితో సంతృప్తి పడుచుండెను. భిక్షుకుల గుంపు త్రోపిడివలన ఒక్కొక్కప్పుడు రఘునాధునకు ప్రసాదము కూడ దొరకెడిదికాదు. అప్పుడు స్వస్థానమునకు వచ్చి జలమును మాత్రము త్రాగి వెళ్లెడివాడు. నాలుగైదు రోజులు తరువాత గౌరాంగప్రభువు "రఘునాధుడు ఇక్కడ భోజనము చేయుట లేదు, ఎక్కడ తినుచున్నాడు?" అను సందేహము కలిగి ఒక భక్తుని అడిగెను. సింహద్వారమువద్ద భిక్షకులతో పాటు కూర్చొని అడిగికొని లభించినది తినుచున్నాడని భక్తుడు చెప్పెను. గౌరాంగుడు ఎంతయో ఆనందించి చెప్పెను. "నిజముగా రఘువు రత్నము. ఆతనికి నిజమగు వైరాగ్యము కలదు. గౌరవము, ఇంద్రియభోగములు, రుచి, సిగ్గు మొదలగువానిని ఆతడు లక్ష్యపెట్టుటలేదు. సన్యాసిజీవితము గడపుచు పరాధీనుడుగా నుండువాడు కుక్కతో సమానము. సన్యాసి భిక్షచేసి భుజించుటయే యుక్తము". కొంతకాలమైన తరువాత ఒక మనుష్యుడు రఘునాధదాసు తండ్రికి తెలిపెను. "కొద్దిరోజులకు పూర్వము వేలకొలది జనులకు యజమాని అయి, వేల కొలది మందిచే తన ఆజ్ఞలను పాటింపజేయు నీ కుమారుడు రఘునాధుడు ఇప్పుడు ముష్టివేసిన అన్నముకొరకు జగన్నాధుని సింహద్వారమున గంటలకొలది నిలబడి ఉండును." తండ్రి చెప్పెను. "ఇంతవైరాగ్యముకల కుమారుడు నాకు కలిగినందున నేను ధన్యుడను." అనంతరము తండ్రి ఒకనికి నాలుగు వందల రూపాయిలు ఇచ్చి పూరీ పంపెను. వంటమనిషిని, నౌకరును ఉంచి రఘునాధుని భోజనమునకు అన్ని ఏర్పాట్లు చేయమనెను.(నాలుగువందల రూపాయలు అనగా ఆరోజులలో ఒక మనిషికి ఒక మాసమునకు ఎనిమిది అణాలు సరిపోవుచుండెడివి) సేవకుడు పూరీ వెళ్లి రఘునాధునకు అన్ని సంగతులను తెలిపెను. రఘునాధుడు ఆలోచించెను. 'ఇంటిని, కుటుంబమును, పరివారమును - సమస్తమును త్యజించిన నాకు తండ్రి పంపిన రూపాయిలతో పని ఏమి? ఈ సమయమున రూపాయలు తీసికొనుట అధర్మము'.

- సశేషం

"మహారాజై కూడా బిచ్చగాని దుస్తులు ధరించగలవాడే మంచివాడు."

# కాలస్వరూపాన్ని మనకన్నుల ముందు వెలిగించే వేదాంగం!

-కంచి కామకోటి జగద్గురు శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతీస్వామి.

వేదపురుషునికి జ్యోతిషం కన్ను. జ్యోతిష సంహితలు వ్రాసిన ఋషులలో గర్గుడూ, నారదుడూ, పరాశరుడూ ముఖ్యులు. సూర్యసిద్ధాంతం అనే జ్యోతిషం ఒకటి వుంది. సూర్యుడు ఈ సిద్ధాంతాన్ని దానవశిల్పి ఐన మయునికి ఉపదేశించాడట. జ్యోతిషానికి మూడు స్కందాలు. ఒకటి సిద్ధాంత స్కందం, రెండు హోరాస్కందం, మూడు సంహితాస్కందం. ఈ రీతిగా జ్యోతిషం స్కంద త్రయాత్మకం ఆంగ్లంలోని అరిత్‌మెటిక్, ఆల్‌జీబ్రా, ట్రిగ్నామెట్రీ, జామెట్రీ అనబడే గణితశాస్త్రాలన్నీ యించుమించు సిద్ధాంతస్కందంలో అంతర్గతాలు. అరిత్‌మెటిక్ వ్యక్తగణితం. దీనిలో కూడిక, తీసివేత, హెచ్చవేత, భాగహారం ఉంటవి. ఆల్‌జీబ్రా బీజగణితం. ఇది అవ్యక్తగణితం. అవ్యక్తాక్షర సంజ్ఞలవల్ల ఇది ఫలం గణిస్తుంది. అవ్యక్తాక్షర కూటాలను సమపరచి వ్యక్తాన్ని కనుక్కోవడమే సమీకరణము లేక ఈక్వేషన్. జామెట్రీ క్షేత్రగణితం.

దాదాపు ఎనిమిదివందల సంవత్సరాల క్రితం భాస్కరాచార్యులు తమ పుత్రిక పేరిట ఒక గణితశాస్త్రం వ్రాసారు. దాని పేరు 'లీలావతి'. గ్రహాల స్థితిగతుల నిర్ణయానికై "సిద్ధాంతశిరోమణి" అనే మరో గ్రంథంకూడా ఆయన వ్రాశాడు. ఘూర్జర దేశపురాజు 'సింగన' అనే ఆయన భాస్కరాచార్యులవారి ప్రచారంకోసం మాన్యమొకటి యిచ్చారని 'ప్రాచీనలేఖమాల' అనే పుస్తకంలోని ఒక శాసనంలో కానవస్తూంది. నవీనగణితం యూక్లిడ్‌లో సప్తమ, అష్టమ, నవమ, దశమ భాగాలు కానరావు. సంస్కృతములో గూడ పండ్రెండు పుస్తకాలు అలభ్యంగా వున్నవి. ఆర్యభట్టు 'ఆర్యభట్టీయం' వ్రాశాడు. ఈనాటి వాక్యగణితం ఆర్యభట్టీయానుసారియే. తెలుగువారి పంచాంగాలు సూర్యసిద్ధాంతాన్ని అనుసరించి ఉంటవి. గణిత శాస్త్రాలు గ్రహనక్షత్రస్థితిగతులను తెల్పుతవి. గ్రహములు ఏడు. రాహు, కేతువులను ఛాయాగ్రహాలని అంటారు. వారిది సూర్యచంద్రులకు విరుద్ధగతి. సూర్యచంద్రుల విపరీత గణనమే రాహుకేతు గణనం, జ్యోతిషంలో గణనం ఎంత సూక్ష్మంగా చేస్తే ఫలితములు అంతనిష్కర్షగా చెప్పడానికి వీలు. మినుకు మినుకుమంటూ ఉండేవి నక్షత్రాలు. స్థిరంగా ప్రకాశించేవి గ్రహాలు, సూర్యుడు. నక్షత్రాలు స్వయంప్రకాశాలు. గురుశుక్రులు పెద్దనక్షత్రాలవలె ఉంటారు. సూర్యునికి సప్తాశ్వుడనే దొక పేరు. సూర్యునికి ఏడు గుఱ్ఱాలు ఉన్నవి. కాని అశ్వపదానికి కిరణమని అర్థం. 'ఏకో అశ్వో భవతి సప్తనామా' – ఒకే కిరణం ఏడు కిరణాలైనవి.

ఆకాశంలో గ్రహాలన్నీ పడకుండా ఎలా నిలిచి ఉన్నాయి? భూమ్యాకర్షణ సిద్ధాంతాన్ని ఒక్క న్యూటన్ కనిపెట్టాడని మనలో పలువురి విశ్వాసం. కాని న్యూటనుకు ఎన్నో ఏండ్లక్రితమే సూర్య సిద్ధాంత గ్రంథారంభంలో భూమి పడకుండా ఉండటానికి కారణం ఆకర్షణశక్తి అని వ్రాయబడినది. ఆకర్షణ అంటే క్రిందకి లాగటం. ఒక వస్తువును పైకి ఎగురవేస్తే అది క్రిందికి చప్పున వస్తుంది. ఇది ఆకర్షణ శక్తి. ప్రాణశక్తి పైకి పోతుంది. అపాన క్రిందికి దిగుతుంది. క్రిందికి లాగే శక్తిని అపానశక్తి అని అంటారు. శంకర భగవత్పాదులవారు భాష్యం వ్రాస్తూ పృథివికి అపానశక్తి ఉందని ఒకచోట సెలవిచ్చారు. ఇలాంటి గొప్ప విషయాలు మన శాస్త్రాల్లో ఎన్నో ఉన్నా తెలియనితనం చేత దేశాంతరీయ శాస్త్రాలకే అవి తెలుసునని అమిత గౌరవం యిస్తుంటాం.

నవగ్రహాల స్థితులు ఎట్లా మారుతున్నవో మనుష్యుల జీవస్థితులున్నూ అట్లు మారుతున్నవి. కష్టం సుఖం ఒకరోజు; సంతోషం మరొకరోజు; దుఃఖం మనోవ్యాకులత, పదవులలో పైకిపోవడమూ, క్రిందికి రావడమూ – ఇట్లు లోకంలో ప్రతి జీవికీ ఎగుడుదిగుడులున్నవి. అంతరిక్షంలో అవిరామంగా ప్రయాణం చేసే గ్రహాలకున్నూ, మాటి మాటి వస్తున్న కష్టసుఖాలను అనుభవిస్తున్న మనుష్యులకున్నూ సంబంధం ఉన్నదని ఎఱిగియే మహర్షులు ఒక్కొక్క గ్రహము యిచ్చే ఫలితాన్ని నిరూపించి ఉంచారు. దీన్ని హోరాస్కంధం విశదీకరిస్తుంది. జననకలాన్ని ఆరంభంగా తీసుకొని సుఖ దుఃఖాలను శాస్త్రమూలంగా తెలిసికోగలుగుతున్నాము.

**న్యూటనుకు ఎన్నో ఏండ్లక్రితమే సూర్య సిద్ధాంత గ్రంథారంభంలో భూమి పడకుండా ఉండటానికి కారణం ఆకర్షణశక్తి అని వ్రాయబడినది.**

అయితే మన సుఖదుఃఖాలకు ఒక్క గ్రహాలేనా

కారణం? వేరే కారణాలుండరాదా? వైద్యుడి దగ్గరకు వెడితే ధాతువ్యత్యాసం, అందుచే వ్యాధి అని అంటున్నాడు. మంత్రవాది దైవాపచారం, అందుచేతనే కష్టం అని అంటున్నాడు. ధర్మశాస్త్రం చదివినవాడు అంతా కర్మఫలం, అది ఫలాన్ని యివ్వడం ప్రారంభించింది అంటున్నాడు. మనశ్శాస్త్రంవాడు అన్నిటికీ మనస్సే కారణము, ఈ కష్టాలకు కారణం మనోభీతి తప్ప వేరే ఏదీ కాదు అని సెలవిస్తున్నాడు. విషయం ఒక్కటే, కాని ఒక్కొక్కరు ఒక్కొక్క కారణం చెబుతున్నారు. ఇందులో ఏది నిజం? కొన్ని సమయాలలో మనం అనుభవించే కష్ట సుఖాలకు మనపాపపుణ్యాలేకాక ఇతరుల పాపపుణ్యాలే కారణమని చెప్పటం కద్దు. ఒక బిడ్డకు జబ్బు చేస్తుంది. తల్లిదండ్రులు చేసిన పాపానికి ఈ నోరులేని బిడ్డ బాధపడుతున్నది అని జాలిపడడమూ కద్దు. సమక్షంలోనే ఉంటూ ఆ శిశువుకు ఏవిధమైన ఉపచారమూ చేయలేక చేతులు పిసుక్కొంటూ మనోవ్యాకులతతో ఆ తల్లిదండ్రులు పడే తత్తరపాటు చూస్తే అది సమంజసమే అని తోస్తుంది. మనకు కల్గే అపాయాదులు శత్రువుల ఉపాయాల మూలంగానేకాక మనం చేసికొన్న పాపపుణ్యాల ఫలం అని కూడా అనుకోవచ్చు. అట్లే మానవుల సుఖదుఃఖాలకు ఇతరుల పాపపుణ్యాలు కారణం అని చెప్పటంలో విరోధమేమీ లేదు. అంతా చిహ్నామాత్రంగా వున్నది. మనం గుర్తించాలనే కాబోలు సర్వమూ ఏకమై వివిధానుభూతులనిస్తుంది. కాన ఒక్కొక్కరు ఏదో ఒక్క కారణాన్నే చూడగల్గుతారు. అదే నిజమని అంటున్నారు.

**మనం గుర్తించాలనే కాబోలు సర్వమూ ఏకమై వివిధానుభూతులనిస్తుంది. కాన ఒక్కొక్కరు ఏదో ఒక్క కారణాన్నే చూడగల్గుతారు.**

వర్షాకాలంలో వానపురుగులు అసంఖ్యాకంగా పుట్టి ఆ క్షణంలోనే నశిస్తున్నవి. కప్పల సందడి చెప్పనలవికాదు, ఇవన్నీ వర్షానికి చిహ్నం. అట్లే కర్మఫలానికిన్నీ అనేక సూచనలు, అనేక చిహ్నాలు. ఈ ప్రపంచంతో సంబంధంలేని వస్తువు ఏదీ లేదు. అట్లే గ్రహగతులననుసరించి వ్యాధులూ, మనశ్చాంచల్యమూ, పిశాచాదులపీడా–ఇవన్నీ కలుగుతున్నవి. అన్నీ కర్మఫలితములే. వానిని తెలుసుకోటానికి మార్గాలు ఎన్నో. అందులో జ్యోతిషం ఒకటి!

# 'సాయీ! మీరెవరు?'

సం॥ 1917లో ఒకసారి శ్రీమతి తార్కాడ్, ఆమె కుమారుడు సాయిని దర్శించారు. అప్పుడు బాబా ఆ కుర్రవానిని బాపూ సాహెబ్ జోగ్ అనే భక్తుని వద్దకు పంపారు. అతడు వెళ్ళే సరికి జోగ్ కొందరు సాటి భక్తులకు 'ధ్రువచరిత్ర' చదివి వ్యాఖ్యానిస్తూ, "సాధువులు దైవం కాకపోయినా, ఆ దైవం చేత ప్రసాదించబడిన మహిమలు కలవారు" అని చెబుతున్నాడు. అది విన్న ఆ పిల్లవాడు వెంటనే సాయిని సమీపించి కోపంతో, "బాబా, నన్నక్కడికెందుకు పంపారు? మీరు మానవమాత్రులేనని, దైవం కారనీ జోగ్ చెబుతున్నారు" అన్నాడు. దానికి బాబా చిన్నగా నవ్వుతూ, "నిజమే, నేనొక పేద ఫకీరును. దైవాన్ని కాను. దైవం ఎంత గొప్పవాడు! ఎవ్వరూ ఆయనతో పోలరు" అన్నారు. అందుకా కుర్రవాడు, "బాబా మీరు మాటలతో మమ్మల్ని మోసపుచ్చుతున్నారు. మీరు దైవం అని మా విశ్వాసం" అన్నాడు. కొద్దిసేపు తరువాత బాబా శ్రీమతి తార్కాడ్‌తో "అమ్మా! నా భక్తుల బాధ్యత నాది. నా భక్తులు పతనం కాబోతుంటే నా నాలుగు చేతులు చాచి వారినుద్ధరించాలి. నా భక్తుని ఎన్నడూ పతనం కానివ్వను." అన్నారు. ఆ మాటలు విన్న ఆ కుర్రవాడు వెంటనే, "బాబా! మీరు ఇప్పుడేకదా 'నేను దేవుణ్ణికాను, పేద ఫకీరు' నన్నది. మరి మీకు నాలుగు చేతులెక్కడివి?" అన్నాడు. దానికి బాబా వాచా ఏమీ సమాధానం చెప్పక ప్రేమతో నవ్వుతూ, ఆ కుర్రవాని మీద తమ యోగదృష్టిని కొంతసేపు నిలిపారు.

# "ఏకం సత్ – విప్రాః బహుధావదన్తి"

ఆచార్య భరద్వాజ

మతాన్ని నిరసించేవారు ముఖ్యంగా దాని తత్త్వమేమిటో యదార్థంగా తెలియని వారేనని క్షుణ్ణంగా మత గ్రంథాలను అధ్యయనం చేస్తే తెలుస్తుంది. ఏ విజ్ఞాన రంగం గురించి తెలియాలన్నా ఆ రంగానికి చెందిన మూల గ్రంథాలను చూడాలిగాని వాటిని చదివే ఓపిక, ప్రీతి లేని కపోలకల్పితములు, వినికిడిగా విని చెప్పే వారి అభిప్రాయాలను తీసుకొని, దానిని గూర్చి అభిప్రాయమేర్పరచుకొని దానిని విమర్శించరాదు. అనుసరించరాదు. వైద్యం తెలియనివాడిచ్చే ముందులాగ, ఈత రానివాడి దగ్గర ఈత నేర్వడం లాగ, దారి తెలియని వారిననుసరించడం లాగ యిది చిక్కులను తెచ్చిపెడుతుంది.

అంతేకాదు. మనస్సు ఏకాగ్రమై స్థిరమవడమే ఆనందమని, సర్వజీవులూ నిరంతరం కష్టించేది దానికొరకేననీ చూస్తాం. ఎక్కువ మందికి మనస్సు ఏకాగ్రం కావడానికి మొదట ఓ ఆలంబనం కావాలి. ఒక్కొక్కరి మనస్తత్వాన్ననుసరించి చాలా మందికి దృశ్య రూపం పై ఎక్కువ సులభంగా మనస్సు లగ్నమవుతుంది. అందుకని దైవం యొక్క గుణాలను స్ఫురింపచేసే సాంకేతికమైన రూపాలను ఋషులు కల్పించారు. రూపాలలో గూడా ఒక్కొక్కరి మనస్సుకు ఒక్కొక్క గుణాన్ని ప్రతిబింబించే రూపం ఆయా లక్షణాలతో కల్పించాలి. అందుకే ఒక్కొక్క దేవతకే వివిధ రూపాలు వున్నాయి. కొందరికి శబ్దం మీద మనస్సు

**సామరస్యం సరిగా మత గ్రంథాల నధ్యయనం చేయనందువలన, వైషమ్యం అధ్యయనం సరిగా చేయనందువలన వస్తాయి. ఇది గుర్తించక మతమే కలహానికి కారణమని తలచడం వైజ్ఞానిక యుగంలో మన కసలే తగదు.**

మతాన్ని విమర్శించేవారు చేసే ఫిర్యాదులలో ముఖ్యమైనది: మతం మత కలహాలకూ, అసహనానికి కారణమైనదని. కాని అట్టి వైషమ్యాలకు మత గ్రంథాలలో ప్రోత్సాహము కన్పించదు. వేరువేరు మతస్థులు దైవాన్ని వేరువేరు పేర్లతో వ్యవహరిస్తారు. మత గ్రంథాలను సరిగా అధ్యయనం చేయనందువలన 'నా దైవమే సత్యం' అని పరస్పరం కలహించుకొంటారు. సరిగా అధ్యయనం చేస్తే అందుకు తావులేదు. అంటే సామరస్యం సరిగా మత గ్రంథాల నధ్యయనం చేసినందువలన, వైషమ్యం అధ్యయనం సరిగా చేయనందువలన వస్తాయి. ఇది గుర్తించక, మతమే కలహానికి కారణమని తలచడం వైజ్ఞానిక యుగంలో మనకసలే తగదు.

ఇందుకు తగిన ఆధారాలను కొన్నింటిని ఉటంకిస్తాను:

'ఏకం సత్ విప్రాః బహుధావదన్తి' అని శృతులు చెబుతున్నాయి. 'సత్యమొక్కటే; దానినెరిగిన వారు దానిని అనేక విధాల నిర్వచిస్తారు' అని అర్థం. ప్రత్యక్షంగా ఆ సత్యాన్ని అనుభవం ద్వారా గుర్తించిన వారికి నిర్వచనం అవసరం లేదు. అట్టి వారు అనుభవం లేనివారికొరకు నిర్వచించడంలో పృచ్ఛకుల మనస్తత్వాన్ని బట్టి వేర్వేరు విధాల నిర్వచించ వలసివస్తుంది.

లగ్నమవుతుంది. అట్టి వారి కొరకు వేరు వేరు లక్షణాలను స్ఫురింపచేసే నామాలు ఏర్పరచారు ఋషులు. కాని యివన్నీ ఒకే పరమాత్మకు వారు వారు పెట్టుకున్న పేర్లు, కల్పించుకొన్న నామాలు అని మతగ్రంథాలు స్పష్టంగా తెలిపాయి. ఈ విషయాన్నే వివరిస్తుందీ క్రింది శ్లోకం:

'మృత్పిండమేకం బహు భాండరూపమ్  
సువర్ణమేకం బహు భూషణాని;  
గోక్షీరమేకం బహుధేను జాతం  
పరమాత్మమేకం బహునామ రూపమ్.'

తా।। ''మట్టి అదును ఒక్కటే; కుండల రూపాలనేకము. బంగారు మొక్కటే; ఆభరణాలు పలురకాలు. వివిధములైన ఆవులనుండి వచ్చినప్పటికీ పాలు ఒక్కటే. (అలానే) నామ రూపాలనేకమైనా, పరమాత్మ ఒక్కడే."

వీటిలో ఏ నామరూపాలతో భగవంతుని ధ్యానించినా కలిగే ఫలితం మనస్సు ప్రశాంతము, పవిత్రము అయి ఆనందం కలగడమే. దీనినే యీ క్రింది గీతా శ్లోకాలు చెబుతున్నాయి:

"ఏ యథామాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్।  
మమవర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థసర్వశః।।"

తా॥ "నన్నేవరేరీతిన ఆరాధిస్తారో ఆ రీతినే వారిని అనుగ్రహిస్తాను. మానవులందరూ ఏ రీతిన అనుసరిస్తున్నా అందరూ నన్నే అనుసరిస్తున్నారు."

నామరూప రహితుడైన భగవంతునికి నామరూపాలు కల్పించడం ధ్యానానికి సౌలభ్యమేగాని వేరుగాదని గీతలో **కృష్ణుడిలా స్పష్టంగా చెప్పాడు:**

"అవ్యక్తాహిగతిర్దు:ఖం దేహవద్భిరవాప్యతే॥"

తా॥ "రూపముగల దేహమే తామని భ్రమించేవారు నిర్గుణ బ్రహ్మాన్ని ధ్యానించడం చాలా కష్టము."

**శివగీత యిలా చెబుతోంది:**

"యేనాకారేణ యేమర్త్యామామేవైకముపాసతే, తేనాకారేణ తేభ్యోహం ప్రపన్నో వాంఛితం దదే."

తా॥ "ఎవరే ఆకారాలతో నన్నుపాసిస్తారో వారికా రూపాలతో ప్రత్యక్షమై (అనుభవమై) కొర్కెలనిచ్చెదను."

కనుక దైవంయొక్క నామరూపాల విషయంలో వైరము, బలవంతమూ తగవని ప్రాచీన గ్రంథాలు చెబుతున్నాయి.

**ఖురాను యిలా చెబుతుంది:**

1) "మతంలో బలవంతములేదు. మంచి మార్గము, చెడుమార్గము రేండూ వేరుగా కన్పిస్తూనే వుంటాయి. ఎవడు మాయను నమ్మక భగవంతుని విశ్వసిస్తాడో వాడే చెడని పట్టుకొమ్మను పట్టిన వాడవుతాడు." (3భా:2అ:34వి.256చ)

2) "అన్ని మతాలు భగవంతుని చేత ఏర్పాటు చేయబడినవే. ఆయనను పొందుటకు తగిన మార్గాలే. ఎవరి కట్టుబాట్లను వారు తప్పితే భగవంతుడు చూస్తూనే వుంటాడు."(6భా.5అ.7వి.48చ.)

3) "మీరు మతంలో చేర్చుకొనుటకు ఇతరులను బలవంతము చేయవచ్చా? ఎపుడో ఒకనాడు భగవంతుని అనుగ్రహం ప్రతివారికి రానే వస్తుంది'. (11భా.10అ.10వి. 99-100చ)

4) మీ ఇష్టం వచ్చిన పేరుతో భగవంతుని పిలుపుడు... ఆయన పేర్లన్నీ గొప్పవే."(15భా. 17అ. 12వి 110చ)

5) "ప్రతిజీవికీ భక్తి మార్గాన్ని ఏర్పాటు చేసియేయున్నాము. వారామార్గములను అనుసరించవచ్చు. వారిలో వారు కలహించరాదు."(17భా.22అ.9వి.67చ)

**మతాలు ద్వేషానికి కారణం కావు. ద్వేషం మానవుడి అజ్ఞానం వలన, పశుత్వం వలన ఏర్పడుతుంది.**

ఈ సత్యాన్నే ఏసు బైబిలులో చక్కటి రూపకాలంకారంగా చెప్పారు: "నీ కితరులేమి చేయాలనుకొంటావో నీవది యితరులకు చేయ్యి." 'అది సహనానికి, సామరస్యానికి వెలుగుబాటగాని మత ద్వేషానికి, దూషణకుగాదు. తండ్రి తన బిడ్డలకు సమానంగా తిండి, గుడ్డ యిస్తాడు. అలానే దైవం అందరికీ సరైన ఆధ్యాత్మిక పథాన్ని కూడా యిస్తారని స్ఫురణ. అలాకాక క్రైస్తవులకే ఆయన సరైన బాటనిచ్చినట్లయితే మానవమాత్రుడి కంటే గూడా దైవం పక్షపాతం కలవాడని, తన బిడ్డలపై ప్రేమ లేనివాడని ఋజువవుతుంది.

కనుక మతాలు ద్వేషానికి కారణం కావు. ద్వేషం మానవుడి అజ్ఞానం వలన, పశుత్వం వలన ఏర్పడుతుంది. అందుకే మత విమర్శకులలో కూడా మత విశ్వాసుల పట్ల అసహనం, ద్వేషం కలుగుతుంది. ద్వేషం మతం యొక్క లక్షణమైతే మత విమర్శకులలో అది కన్పించకూడదు. అంతే కాదు. మత విమర్శకులలో కూడా నాస్తికులకూ, హేతువాదులకూ మధ్య అసహనము, ద్వేషమూ కన్పిస్తున్నాయి కదా! అందువలన నిరీశ్వరవాదమే ద్వేషానికీ. కలహానికీ మూలమనగలమా?

# శ్రీ భరద్వాజ రచనామృతం



## చైనాలో కుటుంబవ్యవస్థ

తావో షూపాంగ్ అనే పండితుని ప్రకారం చైనాలోని కుటుంబాలు నాల్గు రకాలున్నాయి. (1) కుటుంబసభ్యుల మధ్య పరస్పర ప్రేమానుబంధాలవలన కలిసి జీవించే (వారు) అధికభాగం. సాంఘిక స్థిరతకివేమూలం (2) ప్రేమానుబంధాలు చెప్పుకోతగ్గంతగా లేకున్నా వంశాచారాన్ననుసరించి భార్య భర్తకు, పిల్లలు తల్లిదండ్రులకూ విధేయులై వుండాలన్న భావం వలన సభ్యులు కలసివుండే కుటుంబాలు. (3) ఎట్టి ప్రేమానుబంధాలు లేకున్నా ప్రజాభిప్రాయానికీ, సాంఘిక కట్టుబాటుకూ మాత్రమే వెరచి సహజీవనం చేసే కుటుంబాలు; (4) నీతిని విడిచి అక్రమ సంబంధాలేర్పరచుకొని భార్యాబిడ్డలను విడిచే పెద్దలు, వృద్ధులైన తల్లిదండ్రులను అలక్ష్యం చేస్తూ విచ్ఛిన్నమయ్యే కుటుంబాలు. చివరి తరహా కుటుంబాలు సాంఘిక స్థిరతను, నీతిని వమ్ముచేస్తాయి గనుక వాటిని బాహాటంగా నిరసించి, వారి వైఖరిని సరిదిద్దాలంటారు తావో.

Annadhaanam List:-

| | | |
|---|---|---|
| 1. S/Sri K.S. Raman | Secunderabad | Rs. 1350.00/- |
| 2. S/Sri Rokkam Kalayan Raja | Hyderabad | Rs. 1343.00/- |
| 3. S/Sri P. Narahari Sastry | Proddatur | Rs. 1343.00/- |
| 4. S/Sri P. Nagamanemma | Proddatur | Rs. 1343.00/- |
| 5. S/Sri S. Paravathi Devi | Ongole | Rs. 13,430.00/- |
| 6. S/Sri B. Divya Smruthi | Vardhineni Palem (Prakasam) | Rs. 1343.00/- |
| 7. S/Sri B.P. Sunitha | Secunderabad | Rs. 1343.00/- |
| 8. S/Sri G. Purushotham | Secunderabad | Rs. 1343.00/- |
| 9. S/Sri R. Raja Ram | Bangalore | Rs. 1343.00/- |
| 10. S/Sri R. Raghu Ram | Bangalore | Rs. 1343.00/- |
| 11. S/Sri B.G.V.S.V. Ramesh | Rajahmundry | Rs. 1343.00/- |
| 12. S/Sri C.S.S. Bhaskaram | Kakinada | Rs. 1343.00/- |
| 13. S/Sri S. Geetha Rani | Hyderabad | Rs. 1500.00/- |
| 14. S/Sri B. Ramesh | Rajahmundry | Rs. 1343.00/- |
| 15. S/Sri Rajeshwari & Hari Kumar | Hyderabad | Rs. 1345.00/- |

General Donation List:-

| | | |
|---|---|---|
| 1. S/Sri B. Kalyani | Visakhapatnam | Rs. 1116.00/- |
| 2. S/Sri G.R.Viswanath | Hyderabad | Rs. 9500.00/- |
| 3. S/Sri T. Rajeswari | Hyderabad | Rs. 500.00/- |
| 4. S/Sri P. Srinivas Rao | Visakhapatnam | Rs. 500.00/- |
| 5. S/Sri Balaji. Nageswara Rao | Visakhapatnam | Rs. 500.00/- |
| 6. S/Sri S. Kalyani Devi Garu | Proddatur | Rs.10,000.00/- |
| 7. S/Sri G. Brahmaiah | Chirala | Rs. 500.00/- |
| 8. S/Sri G.R.Viswanath | Secunderabad | Rs. 9000.00/- |

# శక్తికొలదిగానే ధర్మకార్యాలకు వెచ్చించాలి

తను మన ధనాలను గురువుకు అర్పించడమంటే తనకలిమినంతటినీ సాటివారి శ్రేయస్సుకొరకు వినియోగించి తన ప్రాకృతికమైన అవసరాలకు, బాధ్యతలకూ సరిపోయినంతవరకే తాను వాడుకోవాలన్న వివేకాన్ని ముందటి సూక్తులు తెలిపాయి. అట్లా అని క్షణికావేశంలో తన శక్తికిమించిన వ్యయం ధార్మికకార్యాలకు చేయరాదని ఈ సూక్తి తెలుపుతుంది. దీనిని గుర్తించకుంటే ఎంతో అరిష్టానికి గురికావలసి వుంటుంది. క్షణికావేశంలో ప్రాకృతికమైన తన నిత్య జీవితావసరాలకు కావలసిన దానిని కూడా దానధర్మాలకు వినియోగించే సంస్కారలేమిననుభవించవలసి వచ్చినపుడు, తాను చేసిన దానానికి పరితాపం చెందుతాడు. తద్వారా దాని పుణ్యఫలం నశిస్తుంది. ఇలా చేసేవారు తాను సాయి కోసం సర్వం త్యాగం చేశాం గనుక తమకు తిరిగి సాయి అన్నీ ప్రసాదిస్తారని ఆశిస్తారు. అట్టి కోరిక వారిలో వున్నంతవరకూ వారు చేసినది త్యాగం కాజాలదు. వారు త్యాగాన్ని నటించిన కపటులూ, అహంకారులూ అవుతారు. కీర్తికాములౌతారు. తమ కష్టదశలో తమ త్యాగాన్ని అనుభవించిన వారెవరూ తిరిగి తమనెవరూ ఆదుకోలేదని బాధపడతారు. ఇట్టి ప్రతిఫలాన్నపేక్షించి చేసేది దానమెలా దైవానికిగానీ, సద్గురువుకుగానీ సమర్పిస్తామని సంకల్పించగానే ఆధ్యాత్మికధర్మరీత్యా అది యిక ఆ దైవానికీ, ఆ సద్గురువుకూ చెందుతుంది. దానిని తిరిగి స్వీకరించడం లేక సమర్పించక దాచుకోవడం సద్గురువు యొక్క లేక దైవం యొక్క వస్తువును అధర్మంగా స్వంతం చేసుకోవడమే ఔతుంది. ఇట్టి పరిస్థితిలో దాతకంటే భోక్త ఎంత శ్రేష్ఠుడైతే అంతమేరకు దోషం సంక్రమిస్తుంది. సాయి చేతికి చేరిన దక్షిణ ఎంత నిస్వార్థంగా ఉదారంగా వినియోగపడుతుందో దానిని దురాశతో వెనక్కు తీసుకోవడం అంత దోషంతో కూడుకొని వుంటుంది. అంతే కాదు, ఇచ్చిన వస్తువును తిరిగి గ్రహించేవాడు సాయికంటే ఆ వస్తువు ఎక్కువ విలువైందని తలచాడన్నమాట. అపుడాతడు చేసిన నమస్కారానికర్థమేమిటి? తన దారినపోయే సత్పురుషుని సత్కరిస్తానని ఆదరంగా ఆహ్వానించడమెందుకు? తిరిగి ఆయన తాను సమర్పించే వస్తువంత విలువైన వాడుకూడా కాదని కించపరచడమెందుకు? చెన్నబసప్ప, వీరభద్రప్పల కధంతటికీ కీలకం మహాదేవునికి అర్పించబడిన ధనానికి బదులుగా నీచుడైన ధనికుడు ఊసరక్షేత్రానివ్వడమే. ఇట్టి కుదానం అధఃపతనానికే హేతువు. ఒక వంక తనశక్తికి మించి దానం చేయవద్దని సాయి చెప్పిన దానిని విస్మరించడమెందుకు?

**తల్లి బిడ్డకోసం, ప్రియుడు ప్రియురాలి కోసం చేసే త్యాగంవంటి దాన్ని భగవంతునిపట్ల భక్తితో చేసినపుడే అది సాత్వికదానమై సత్ఫలితాలనిస్తుంది.**

ఔతుంది? ప్రతిఫలాన్నపేక్షించి దానం చేసేవాడు 'కుత్సితదాత' అని 'శ్రీగురుచరిత్ర' చెబుతుంది. ఇట్టిది రాజసికము, తామసికమూ అయిన దానమని భగవద్గీత చెబుతుంది. తల్లి బిడ్డ కోసం, ప్రియుడు ప్రియురాలి కోసం చేసే త్యాగంవంటి దాన్ని భగవంతునిపట్ల భక్తితో చేసినపుడే అది సాత్వికదానమై సత్ఫలితాలనిస్తుంది. ద్రాక్షపండ్లబుట్టను ఒక తల్లి సాయికి సమర్పించగానే ఆయన సంతోషంతో స్వీకరించారు. దానిని గూర్చి ఆమె కూతురు పరితపించగానే వాటిని తిరస్కరించి ఆయన తిరిగిచ్చేశారు. ఇది కూడా సంతోషించవలసిన విషయమేమీకాదు. ఒక్కసారి మనస్పూర్తిగా దేనినైనా మరొకవంక ఆయన "నేనెవరి నుండైనా ఒక్కరూపాయి స్వీకరిస్తే దానికి వందరెట్లు శ్రేయస్సు వారికి చేకూర్చవలసి వుంటుంది" అన్నవారి వాక్యాలను విస్మరించి పరితాపం చెందడం ఎందుకు? ఇంతటి అనర్థానికి మూలం తాను దాతనన్న అహంకారమే. ఇలాచేసేవారు పై సూక్తిని విస్మరించడమేగాక 'అల్లామాలిక్' అన్న సూక్తిని గూడ విస్మరించినవారే. భక్తోయొక్క శ్రేష్ఠతననుసరించి కుత్సితదాత పొందే దుష్ఫలితం ఆధారపడి వుంటుందని నిరూపించే సంఘటన ఒకటున్నది. శ్రీ సాయికి అందజేయవలసిన రెండు రూపాయలను భక్తుడు శ్యామా రహస్యంగా మసీదు ముంగిట పాతిపెట్టాడు. సాయి

సర్వజ్ఞత్వాన్ని పరీక్షించాలని ఇతడి సంకల్పం. అనతి కాలంలో అతడింట దొంగలుపడి సర్వాన్ని దోచుకుపోయారు. తన

**పవిత్రకార్యాలకు అప్పుచేయడం వలన అప్పిచ్చేవారు సద్భావంతో యిస్తే పుణ్యఫలం వారి పరమౌతుంది. వారు బాధపడుతూ యిస్తే ఆ దోషం మనదౌతుంది.**

బాధనతడు బాబాకు చెప్పుకున్నాడు. బాబా నవ్వి, "నీవస్తువులు పోతే చెప్పుకోవడానికి నేనైనా వున్నాను. నావి రెండురూపాయలు పోయి చాలారోజులైంది. నేనెవరితో చెప్పుకోనేది?" అన్నారు. "మీ రెండు రూపాయలు దాచిపెట్టినందుకింత కఠినంగా శిక్షించడం సమంజసమా?" అన్నాడు శ్యామా. "ఉద్యోగము ఇల్లూకల నీవంటివాడికి దొంగలు సర్వమూ ఎత్తుకుపోతే యెంతో, నావంటి భిక్షకునికి రెండు రూపాయలు పోతే అంతే" అన్నాడు సాయి. సాయిబాబా ఒక్కొక్కసారి భక్తులనుండి అధికంగా దక్షిణలు కోరి, వారి వద్ద పైకం లేనపుడు ప్రక్కవారినడిగి ఇమ్మనేవారు. ఇవి ప్రత్యేక సందర్భాలు. అటువంటి సందర్భాలలో సద్గురుని ఆజ్ఞను పాటించడం మంచిది. అంటే అలా మనను కోరినవారు సాయి యంతటి సద్గురువులౌనో కాదో చూచుకోవాలి. లేకుంటే సద్గురువువలె నటించే స్వార్థపరుల బారినపడి భక్తులు చెడిపోతారు. ఇలా సేకరించిన దక్షిణను సాయి యెలా వినియోగించేవారో, వారి జీవిత విధానము, మహిమ ఎంతటివో గమనిస్తే మనకర్థమౌతుంది. పవిత్రకార్యాలకు అప్పుచేయడం వలన అప్పిచ్చేవారు సద్భావంతో యిస్తే పుణ్యఫలం వారి పరమౌతుంది. వారు బాధపడుతూ యిస్తే ఆ దోషం మనదౌతుంది. వారి ఋణాన్ని మనం తీర్చడం ఆలస్యమైతే వారు పడ్డ బాధకు కూడా బాధ్యులం మనమే. అట్టి ఫలితాన్ని మనమనుభవించవలసి వుంటుంది. తెలియని అవివేకులు కొందరు అది సాయి కోసం, లేక దైవం కోసం చేసిన ఋణం కదా, దాన్ని తీర్చవలసిన బాధ్యత ఆ దైవంపైనో, లేక సద్గురువుపైనో వుంటుందని తలచి, తమకు ఎట్టి బాధ్యతాలేదని భ్రమిస్తారు. అప్పిచ్చేవారు భక్తుని చూచి యిచ్చారే కానీ దైవాన్ని చూచి కాదు గదా! వారు దైవాన్ని చూచే యిచ్చివుంటే వారే తిన్నగా దైవానికి సమర్పించేవారు గదా! వారు భక్తులకు మరలా అప్పుగా ఎందుకివ్వాలి? శక్తికొలదిగానే ధర్మకార్యాలకు వెచ్చించాలని తెల్పడానికే భగవద్గీతలో కృష్ణుడు శ్రద్ధాభక్తులతో సమర్పింపబడినది ఆకైనా, పూవైనా, చివరికి నీరైనా తను తృప్తితో స్వీకరించి, భక్తుని అనుగ్రహిస్తానని చెప్పారు.

ధర్మ కార్యాలకు శక్తికి మించి ఎలా వ్యయం చెయ్యకూడదో అలానే శక్తివుండి కూడా స్వల్పతరంగా వ్యయం చెయ్యడం గూడా కృపణత్వమే ఔతుంది. అట్టివాడికి శ్రద్ధాభక్తులు లోపించినట్లే. మన ప్రేమకు పాత్రులైన భార్యాబిడ్డలకు యథాశక్తి సమర్పింస్తాంగదా! భగవంతుడంతమాత్రం చెయ్యడా?

ధర్మ కార్యాలకు అధికంగా వ్యయం చెయ్యలేని సామాన్యులాచరించ వలసిన ధర్మాన్ని "శాస్త్రాలెన్నటికీ అబద్ధం కావు". అని చెప్పిన సూక్తిలో సాయి సూచించారు. అందులో సూచించిన కాకబలి ఏ ఆకలిగొన్న ప్రాణికి దక్కినా, ఆ రూపాలలో సర్వత్రా సంచరిస్తూన్న సాయికి చెందుతుంది. దాన్నే "ఋణానుబంధాన్ని విశ్వసించి గుర్తుంచుకో..."; "నిన్నెవరైనా అర్థిస్తే ఇవ్వశక్యమైతే యివ్వు..." అన్న సూక్తులు కూడా

**ధర్మకార్యాలకు శక్తికి మించి ఎలా వ్యయం చెయ్యకూడదో అలానే శక్తివుండి కూడా స్వల్పతరంగా వ్యయం చెయ్యడం గూడా కృపణత్వమే ఔతుంది.**

సూచిస్తాయి. అలా భక్తిశ్రద్ధలతో ఆచరించిన వారికి, "నా కర్పించకుండా ఎవడైతే ఏమీ తినడో వాడికి బానిసను" అన్న అభయం వర్తిస్తుంది. దానికి కనీసమైన ప్రతిఫలమే "నా భక్తునింట్లో అన్నవస్త్రాల లేమి వుండదు. నా బిడ్డలను పస్తులు ఎలా వుండనిస్తాను?", "నావాణ్ణి నా నుంచి దూరమేనాటికీ కానివ్వను" అనే సూక్తులలో సూచించబడింది.



"మహారాజై కూడా బిచ్చగాని దుస్తులు ధరించగలవాడే మంచివాడు"

# మౌఢ్యాన్ని వీడితే మతాలసారం ఒక్కటేనన్న సాయి-క్రీస్తులు

ఆచార్య భరద్వాజ

ఈ నెల 25వ తేదీన ప్రపంచమంతటా కోటానుకోట్లమంది క్రిస్టమస్ పండుగను ఎంతో వేడుకగా, భక్తిశ్రద్ధలతో చేసుకుంటారు. అది పావనమూర్తి ఏసుక్రీస్తు జన్మించిన రోజు. ఆయన అసలు పేరు 'జోష్యు'. ఆ పేరుకు అర్థం 'దైవమే (యహోవానే) ముక్తి" అని. అది గ్రీకు భాషలో 'జీసస్' అయింది. 'క్రీస్తు' అన్నది ఆయన యొక్క దివ్యత్వాన్ని, అవతారకార్యాన్ని సూచించే బిరుదు. 'రక్షకుడు' లేక 'ముక్తిప్రదాత' అని అర్థము. బైబిల్‌లోని కొత్త నిబంధనను జాగ్రత్తగా పరిశీలిస్తే, ఆయన చరిత్రను బట్టి, బోధనుబట్టి ఆయన సద్గురువని తెలియగలదు.

సద్గురువులు హైందవ సాంప్రదాయం ప్రకారము రెండు రకాలుగా ఉంటారు - ఋషభుడు, శుకుడు, శ్రీపాదశ్రీవల్లభుడు, శిరిడీ సాయిబాబాల వలె - జన్మతః దివ్య స్వరూపులైన వారు కొందరు సామాన్య మానవుల వలె జన్మించి, తీవ్రసాధన వలన దివ్యత్వాన్ని పొందినవారు - తాజుద్దీన్‌బాబా, రామకృష్ణ పరమహంస వంటివారు - కొందరు. మొదటి తెగకు చెందిన కపిలుడు, ఆది శంకరుడు వంటి వారిని అవతార పురుషులని హైందవ సాంప్రదాయం వ్యవహరిస్తుంది. అలాగాక మానవచరిత్రపై వారికిగల విస్తృతప్రభావమును బట్టి కొందరిని అవతారాలుగా పరిగణించే సాంప్రదాయమూ ఉన్నది. ఏసుక్రీస్తు కూడా ఆ కోవకే చెందుతారు. అయితే తక్కిన మతాలను సహృదయతతో కూలంకషంగా పరిశీలించని కొందరు క్రైస్తవ సోదరులకు ఈ నిర్వచనం నచ్చకపోవచ్చు. అట్టివారు క్రీస్తు ఒక్కరే భగవంతుని బిడ్డగా అవతరించిన భగవంతుడని, ఇతర మతాలకు చెందిన మహాత్ములందరూ సైతాన్ అనుయాయులనీ వాదిస్తారు. కాని బైబిల్‌లోని క్రీస్తు చరిత్రను, బోధలను పరిశీలిస్తేగాని వాస్తవము తెలియదు. క్రీస్తు ఒక్కరే భగవంతుడని వాదించేవారు చెప్పే ఆధారాలను పరిశీలిద్దాము.

హిందూమతంలో వేదాంతులు పరమాత్మలో సత్, చిత్, ఆనందము, అనీ, పౌరాణికులు బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు అనీ మూడు తత్త్వాలు గుర్తించినట్లే క్రైస్తవులు 'జగత్‌పిత', 'పరిశుద్ధాత్మ', 'దివ్యపుత్రుడు' అనే మూడు అంశాలను గుర్తించారు. జగత్‌పిత పరలోకములో ఉంటాడు. పరిశుద్ధాత్మ మానవులకు భగవంతుని గూర్చిన సత్యాన్ని అందిస్తుంది. దీని యొక్క మహిమ చేత అలౌకికమైన రీతిన మరియమ్మ గర్భాన దివ్యపుత్రుడు జన్మించి, మానవులకు 'ముక్తి' లేక 'పరలోక రాజ్యము'ను సాధించుకొనే మార్గాన్ని ఉపదేశించారు క్రీస్తు. యూదుల సాంప్రదాయము ప్రకారము ఈ పరిశుద్ధాత్మే ప్రవక్తలందరి ద్వారా మానవాళికి దివ్యసందేశాన్ని అందిస్తుంది. సర్వమతాలలోని మహాత్ములందరికీ యిది వర్తిస్తుంది.

క్రీస్తు యొక్క అలౌకిక జననము వలన ఆయన అద్వితీయుడని కొందరు వాదిస్తారు. కాని శిరిడీ సాయి తన జననముగూర్చి కూడ వారే "ప్రకృతి-పురుషుల సంయోగము వలన నాకు ఈ దేహము వచ్చినది" అని అన్నారు. తాము జన్మించినప్పుడు వారి తల్లి తనకు మగబిడ్డ జన్మించినందుకు సంతోషిస్తుంటే వారు మాత్రము, "నేను యిప్పుడు క్రొత్తగా జన్మించటమేమిటి? నేను యింతకు ముందు నుండి ఉన్నాను గదా!" అనుకొన్నారట. తండ్రి ప్రసక్తి మాత్రము లేదు! క్రీస్తు యూదులకు ఆదిపురుషుడైన అబ్రహామునకు పూర్వమే తాము ఉన్నట్లు చెప్పారు. అలానే సాయికూడ తాము రామాయణ కాలంలో ఉండి ఆ వృత్తాంతము స్వయముగా చూచామని చెప్పారు. తమ వయస్సు లక్షల సంవత్సరాలు అని చెప్పారు. "నన్ను చూచినవాడు జగత్ పితను చూచినట్లే" (యోహాను 14:8) అన్నారు క్రీస్తు. "నేను, దైవమూ ఒక్కడే" ("మై అల్లాహూ") అన్నారు సాయి. జగత్‌పిత సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు, కరుణామయుడు అయినట్లే క్రీస్తు కూడానని వారి చరిత్ర సూచిస్తుంది. శిరిడీ సాయి చరిత్ర కూడా వారిని గూర్చి అదే తెలుపుతుంది.

క్రీస్తు శిలువపై మరణించాక మూడు రోజులకు మరల భౌతిక దేహముతో తమ శిష్యులకు దర్శనము యివ్వగలగటము

**హిందూమతంలో వేదాంతుల పరమాత్మలో సత్, చిత్, ఆనందము, అనీ, పౌరాణికులు బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు అనీ మూడు తత్త్వాలు గుర్తించినట్లే క్రైస్తవులు 'జగత్‌పిత', 'పరిశుద్ధాత్మ', 'దివ్యపుత్రుడు' అనే మూడు అంశాలను గుర్తించారు.**

వలన క్రీస్తు అద్వితీయుడని క్రైస్తవుల వాదము. కాని 1886 సంవత్సరంలో శ్రీసాయి బాబా ముందుగా భక్తులకు తెల్పి, మూడు రోజులపాటు మరణించి, తిరిగి సజీవులై భూమిపై 1918 వరకూ జీవించారు. ఈ యిద్దరి సద్గురువుల చరిత్ర ఒక్కలాగే ఉండటము గమనార్హం. అందుకే నేను రచించిన ఆంగ్ల సాయిబాబా జీవిత చరిత్ర "Sai Baba the Master" గురించి అమెరికాలోని ప్రఖ్యాత తత్వవేత్త పాల్‌రెప్స్ (Paul Reps) యిలా వ్రాశారు : "నాకుగాని, మరి యెవ్వరికి గాని, 'Sai Baba the Master' చదువకుంటే జీసస్ జీవితము అర్థం చేసుకోవటం అసంభవము. శిరిడీ సాయిబాబా మహాత్ములందరిలోకి గొప్పవారు. ఈ గ్రంథాన్ని పాశ్చాత్య దేశాలలో ప్రచురించడము ఎంతో అవసరము."

క్రీస్తు యొక్క జననాన్ని గూర్చి ఎందరో ప్రవక్తలు ముందుగానే "జగద్రక్షకుడు అవతరించబోతాడు" అని చెప్పినట్లు బైబిలులోని పాత నిబంధనలలో పలుచోట్ల గ్రంథస్థమై ఉన్నదని; కనుక ఆయన ఒక్కడే భూమిపైన అవతరించిన భగవంతుడని క్రైస్తవులు అంటారు. ఇట్టి ఆధారాలు ప్రత్యేకముగా మత్తై సువార్తలో (The Gospel of Mathew) లో ఎక్కువ భాగం కనిపిస్తాయి. ఆ సువార్త మీద అధికారికమైన వ్యాఖ్యను వ్రాసిన విలియమ్ బార్క్లే (William Barclay) గ్రంథం చూస్తే వాస్తవము తెలుస్తుంది. క్రీస్తు యొక్క భక్తుడూ, ప్రచారకుడూ అయిన మాత్యూ (Mathew) యూదు జాతికి చెందినవాడు. సాటి యూదులచేత క్రీస్తు భగవంతుని పుత్రుడైన జగద్రక్షకుడని నమ్మించాలన్న ఆతృతతో పాతనిబంధనలోని ప్రవక్తల వాక్యాలను వక్రీకరించి, అవి వాస్తవముగా క్రీస్తు జననానికి సంబంధించనివైనప్పటికీ ఆ రకంగా చిత్రించి మాత్యూ కల్పన చేశాడు అని బార్క్లే సోదాహరణముగా వివరించారు. కనుక ఈ వాదము సరియైనది కాదు.

ఇక క్రీస్తు, శ్రీ శిరిడీ సాయిబాబా వంటి సద్గురువనటానికి కొన్ని ఉదాహరణలు : (1) ఉత్తముడైన సద్గురువు తాను ఆజన్మ సిద్ధుడైనప్పటికి, మానవులందరికీ ఆదర్శాన్ని చూపించటానికి, సత్సాంప్రదాయాన్ని గౌరవించటానికి ఒక గురువును ఆశ్రయిస్తారు. శ్రీకృష్ణుడు సంపూర్ణ భగవదావతారమైనప్పటికీ సాందీపని మహర్షికి శిష్యుడయ్యాడు. క్రీస్తు యోహాను (జాన్) అను ప్రవక్తకు శిష్యుడై 'బాప్తీజమ్' (ఉపదేశము) పొందారు. తామొక సద్గురువును 12 సం॥ దీక్షగా సేవించి వారి అనుగ్రహాన్ని పొందినట్లు శ్రీసాయిబాబాకూడ చెప్పారు. (2) తీవ్రమైన సాధన ద్వారా సర్వమూ తానే అయిన భగవంతుడు – తాము వేరుగాదన్న జ్ఞానాన్ని పొందిన వాడే సద్గురువు. భగవంతునికి వలెనే సద్గురువుకు కూడ తానుకానిదేదీ ఉండదు. కనుక అద్వితీయుడు. అట్టి స్థితిని జన్మతః కల్గియున్నవాడు

**తీవ్రమైన సాధన ద్వారా సర్వమూ తానే అయిన భగవంతుడు – తాము వేరుగాదన్న జ్ఞానాన్ని పొందిన వాడే సద్గురువు.**

'జన్మతః భగవంతుని దివ్య పుత్రుడు' ('The only begotten son of God'). అట్టి స్థితిగల సిద్ధ పురుషులు భౌతికంగా ఎందరున్నా అంతర్యంలో వారంతా ఐక్యత కల్గియుంటారని శ్రీసాయిబాబా చరిత్ర చూస్తే తెలుస్తుంది. కనుక వారిలో ప్రతి ఒక్కరూ తమభక్తులకు "నా ద్వారా తప్ప భగవంతుని ఎవ్వరూ చేరలేరు" అంటారు. వారి భక్తులలో మూఢులైనవారు యీ తత్వాన్ని అర్థం చేసుకొనక "నా సద్గురు వొక్కడే దైవము; మిగిలినవారు కారు" అని తగవులాడు కొంటారు. ఇదే మనకీనాడు కన్పించే పరమతదూషణకు కారణం. ఈ భావం మౌఢ్యమనడానికి ఋజువు వారందరి బోధలూ ఒకే తీరుగా ఉండడమే. అన్ని మతాల మూల సూత్రాలూ ఒకే రీతిగా ఉన్నప్పుడు యితర మతాలకు చెందినవారు పాపులని, తమ మతమొక్కటే సత్యమనీ వాదించడమెలా రైటవుతుంది? అన్ని మతాలలోనూ ఉన్న ప్రధాన సూత్రాన్ని త్రికరణశుద్ధిగా పాటించక, బాహ్యాంబర మొక్కటే కల్గియుండి, నిత్యజీవితంలో నైతిక ధర్మాలను పాటించని వారందరూ పాపులే. ఆ విషయం క్రీస్తు చెప్పినదానిలో స్పష్టమవుతుంది. తన భక్తులమని చెప్పుకొంటూ, తన నామాన్నుచ్చరిస్తూ గూడ తాము చెప్పిన ధర్మసూత్రాలను పాటించని వారిని తాను రక్షించనని, వారికి నరకమే గతియనీ చెప్పారు. అందుకే వారు చెప్పిన 'స్వామి ప్రార్థన' ('The Lord's Prayer') లో క్రైస్తవమతానికీ, క్రీస్తుకూ పరిమితమైన పదమొక్కటి గూడా లేదు.

**అన్ని మతాల మూల సూత్రాలూ ఒకే రీతిగా ఉన్నప్పుడు యితర మతాలకు చెందినవారు పాపులని, తమ మతమొక్కటే సత్యమనీ వాదించడమెలా రైటవుతుంది?**

(3) పైన చెప్పినట్లు తామే సర్వమూ అయిన

భగవంతుడని చెప్పి ప్రతి సద్గురువూ నిజమైన శిష్యులను తమవంటి సద్గురువులుగా రూపొందిస్తారు!! (ఆత్మ తుల్యాన్ కరోతి). క్రైస్తవ పదజాలంలో చెప్పాలంటే-దేవుని బిడ్డలుగా రూపొందిస్తారు. అట్టి స్థితినే ఆయన పరలోక రాజ్యమన్నారని మత్తై సువార్త బార్క్లే పండితుని వ్యాఖ్య చూస్తే తెలుస్తుంది. తానొక్కడే భగవంతుని వంటి పరిపూర్ణుడనని క్రీస్తు చెప్పలేదు. క్రైస్తవులనుకున్నట్లు తన శిష్యులందరికీ అంతటి పరిపూర్ణులమని చెప్పాడు; భగవంతుని దివ్య పుత్రులవమన్నారు (మత్తై సువార్త 4:43 నుండి 48). ప్రతి మతంలోని సద్గురువూ సాయి, క్రీస్తులవలే తమశిష్యులెందరినో – అర్హులైనవారిని – అలా బోధకులైన పరమ గురువులు. ఇద్దరూ శిష్యులకు ఆధ్యాత్మికానుభూతిని సంకల్పమాత్రంచేత ప్రసాదించగల వారేనని వారి చరిత్రలు నిరూపిస్తున్నాయి. ఇద్దరూ అస్ఖలిత బ్రహ్మచారులు. ఇల్లు, వాకిలి, ధనము లేకుండా, రేపటికని దాచుకోకుండా జీవించారు. కష్టాలతోను, రోగాలతోను బాధపడుతున్న వారి బాధలను బాపారు. క్రీస్తు కూడా సాయివంటి సద్గురువే. ఇద్దరూ మత మౌఢ్యాన్ని వ్యతిరేకించారు.

"ఎండ, నీరు, పాపులకు, పవిత్రులకూ దైవం సమానంగానే యిస్తున్నారు" (మత్తై 5:43-48) అన్నారు క్రీస్తు. అలా అన్ని దేశాల, జాతుల, మతాల వారికీ వీటిని ప్రసాదిస్తున్న

**తానొకడే భగవంతుని వంటి పరిపూర్ణుడనని క్రీస్తు చెప్పలేదు. క్రైస్తవులనుకున్నట్లు తన శిష్యులందరికీ అంతటి పరిపూర్ణులమని చెప్పాడు; భగవంతుని దివ్య పుత్రులవమన్నారు (మత్తైసువార్త 4:43 నుండి 48).**

చేశారు. అలా రూపొందిన శిష్యులతో "మీరు ప్రపంచానికి వెలుగులవ్వాలి" (మత్తై 4:14) అన్నారు. అటువంటప్పుడు క్రీస్తు తప్ప అన్యులెవరూ 'భగవంతుని బిడ్డలు', 'భగవత్స్వరూపులు', 'మానవాళికి మార్గదర్శకులూ' కారని వారించే పామర క్రైస్తవ మాటలు నమ్మాలా? క్రీస్తు బోధలకు భిన్నంగా మత ప్రచారం ఆయన పేరిట చేసేవారు సైతాను అనుయాయులా, లేక వాటికి సరిపోవులాగున బోధించి, ఆచరించి తరించిన యితరమతాలలోని సద్గురువులు, యీ సత్యాన్ని తెలిసిన వారి భక్తులూ సైతాను అనుయాయులా?

క్రీస్తు సాంప్రదాయకమైన యూదు కుటుంబంలో జన్మించారు. శాశ్వతమూ, దివ్యమూ అయిన యూదు ధర్మాన్ని తాను వమ్ముచేయమని, వాటిని పరిపూర్ణం చేయడానికే అవతరించామనీ చెప్పారు (మత్తై 5:17-20). కాని ఎన్నో యూదుసాంప్రదాయాలను ఆయన ఆచరణలో తృణీకరించడం చరిత్రలో చూడవచ్చు. అంటే మూఢమైన బాహ్యాడంబరాన్ని ఆయన నిరసించారు. ధర్మంయొక్క నిజతత్త్వాన్ని బలపరచారు. శ్రీసాయిబాబా అలానే చేసిన వివరం 'శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర'లోని 'సాయి-సాంప్రదాయం' అన్న అధ్యాయంలో చూడవచ్చు. అంటే ఇద్దరూ నిత్యజీవితంలో పరిణతి తెచ్చుకోవడం ఆవశ్యకమనే ధర్మస్వరూపాన్ని తెల్పిన సద్గురువులు. అంతేకాదు. ప్రార్థన ఎలా చేయాలో క్రీస్తు బోధించి ముక్తి మార్గాన్ని తెల్పారు. సాయి కూడా తెల్పారు. సాయి తెల్పిన దానిలో "నా ద్వారా తప్ప భగవంతుని ఎవ్వరూ చేరలేరు" అని క్రీస్తు వంటి సద్గురువు చెప్పేదాని అసలైన అర్థం బోధపడుతుంది. యిద్దరూ ముక్తిమార్గ దైవం, ఆధ్యాత్మిక జ్ఞానం మాత్రం ఆయా మత ప్రవక్తల ద్వారా వారి కందజేయరా? "రొట్టెనర్థించే బిడ్డకు రాయినిచ్చే తండ్రి వుండడు" అని క్రీస్తు అనలేదా? అటువంటప్పుడు యితర మతస్తులందరూ పాపులని బొబ్బలు పెట్టే వారికి క్రీస్తు చెప్పినదేమి తెలిసినట్లు? "సాటి వానిని 'తెలివితక్కువవాడా!' అని నిందించినాసరే నరకానికి పోతావు" అని క్రీస్తు చెబుతుంటే పై సత్యాన్ని మరచి యితర మతస్థులను నిందించేవారేమవుతారు? "ఒక చెంప కొడితే యింకొక చెంపయివ్వ" మని ఆయన చెబితే తామే యితర మతాలను నిరసించడానికి పూనుకున్న వారు ఆయనచెప్పిన మార్గాన్ననుసరించిన వారెలా అవుతారు? ఇన్ని సత్యాలూ క్రీస్తుకు ప్రతి రూపమనిపించే సాయి జీవితంలో పూర్ణంగా ప్రతిబింబించాయి. పాల్ రెప్స్ వ్రాసినట్లు సాయి చరిత్ర చదివి, క్రీస్తు చరిత్ర, బోధలను సరిగా అర్థంచేసుకొని రానున్న క్రిస్మస్ నాడైనా మీ హృదయాలలో నిజమైన క్రీస్తును జనింపచేసుకోండి. "విష్‌యూ ఎ హోలీ క్రిస్మస్!".

# 'సాయిలీలామృతం' మరో 'గురుగ్రంథసాహెబ్!'

పూజ్య గురుదేవులు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారు శిరిడిలో శ్రీ సాయి సన్నిధిలో దివ్యానుభవం పొంది, కాలాంతరంలో ఎందరో మహాత్ముల చేత 'సాయిబాబా కా బేటా' అని పిలిపించుకున్న మహనీయులు. వీరు శ్రీ సాయి ఆదేశించిన మీదట 'శ్రీ సాయిలీలామృతం' అన్న సాయి చరిత్ర గ్రంథాన్ని సర్వమావాళికీ అణుసరణీయమైన రీతిన పారాయణ గ్రంథంగా రచించారు. నకిలీ గురువుల బారిన పడిన ఆధ్యాత్మిక విద్యను పునరుద్ధానం చేయడానికి పరిపూర్ణ దత్తావతారంగా వెలసిన శ్రీ సాయినాథుని బోధలను అనుసరించడమే సరియైన విధానమని, అట్టి శ్రీ సాయి యొక్క ప్రతిరూపమే 'శ్రీ సాయి లీలామృతము' అని చెప్పి ఆచరణయోగ్యం ప్రసాదించారు. వారు రచించిన 'శ్రీ సాయినాథ ప్రబోధామృతం' అన్న గ్రంథంలో వారు 'శ్రీ సాయి లీలామృతం' గురించి ఇలా వ్రాసారు.

"ఈ (సాయిలీలామృతం) గ్రంథం, సాయి నాడు భౌతిక కాయాన్ని విడచినా నిత్య చైతన్య దేహంతో మన హృదయాలలో జ్ఞానజ్యోతిని వెల్గించగల సగుణ గురుస్వరూపం. 'గ్రంథం గురువెలా అవుతుంది'? అనకండి. మహితాత్ముడైన శ్రీ గురునానక్ సాధకునికి సద్గురువునాశ్రయించడం అత్యావశ్యకమని బోధించి, అట్టి గురువు స్థూలంగా లభించని వారు తాము రచించిన 'గురుగ్రంథ సాహెబ్'ను గురువుగా ఆశ్రయించవచ్చని హామీయిచ్చారు. 'శ్రీ సంహితాయన గురుద్విసాహస్రి' అను 'శ్రీ గురుచరిత్రము' అట్టిదే. శ్రీ సాయి చరిత్ర అట్టిదే. మిగిలిన సద్గ్రంథాలన్నీ ఆధ్యాత్మికసత్యాలు బుద్ధికి గోచరమయ్యేటట్లు తాత్వికంగా, సిద్ధాంతంగా బోధిస్తాయి. మరలా వాటిని సరిగా వివరించడానికి వేరొక ఆత్మనిష్ఠుడైన గురువుకావాలి. శ్రీసాయి అనుభవాల ద్వారా భక్తుల హృదయాలకు నిరంతరం బోధించిన అమరగాథ 'శ్రీ సాయి బాబా జీవిత చరిత్ర'. కనుక ఆత్మనిష్ఠుడైన గురువు వివరించనవసరంలేని ప్రత్యక్షబోధ అది. తక్కిన ఆధ్యాత్మిక గ్రంథాలన్నీ సూత్రప్రాయంగా చెప్పిన ఆధ్యాత్మిక తత్వానికి అనుభవ పూర్వకమైన వివరణ ఆ గ్రంథం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు తనను అచంచలమైన భక్తితో సేవిస్తే అట్టివాడికి బుద్ధియోగాన్ని గూడా తానే ప్రసాదిస్తానని అభయమిచ్చారు. అయినా 'శ్రీకృష్ణుడిని అలా సేవించగల్గేదెలా' అనేది భక్తులకు సమస్యగానే మిగులుతోంది. అందుకే సాయి చరిత్రను శ్రద్ధతో పఠించినంత మాత్రాన అట్టి భక్తిని, తర్వాత తద్వారా బుద్ధియోగాన్నీ గూడ యివ్వగలదని 'శ్రీసాయిబాబా చరిత్ర' లోని ఎందరి అనుభవాలో నిరూపిస్తున్నవి.

దీనిని కొంచెము వివరిద్దాము. మొదట భక్తులు ఏవో కష్టాలు, కోరికలూ తీర్చమన్న సంకల్పంతో 'శ్రీబాబా చరిత్ర' చదువుతారు. ఎక్కువమందికి ఏవో కొన్ని త్వరత్వరగా నెరవేరుతాయి. కాని యింతలోనే వారిలో చక్కని పరిణతి వారు గుర్తించకనే కల్గుతుంది. అటు తర్వాత కష్టాలు, కోరికలు తీరకున్నా ఆ గ్రంథాన్ని చదువుతూనే ఉంటారు. ఆయనను సేవిస్తూనే ఉంటారు. 'నాకేమీ అనుభవాలు లేవుగాని మనస్సుకు శాంతి మాత్రం కల్గుతుంది. ఇదివరకు సమస్యలొస్తే కలత చెందే మనస్సు యిప్పుడు కలతచెందదు. మనకేది శ్రేయస్కరమోనన్నది మనకంటే ఆయనకే బాగా తెలుసునన్పిస్తుంది. మన మేలుకానిదేదీ ఆయన జరగనివ్వరని తెలుస్తుంది' అంటారు. బాగా యోచించండి, యిది ఎంతటి చక్కని పరిణతో! ఏ కోరికవలనా ప్రేరేపించని భక్తి, విశ్వాసం కాదా యిది? ఎన్ని అద్భుతాలు కూడా యివ్వలేని పరిణతి కాదా? బుద్ధియోగంకాదా? అట్టి స్థితిని ప్రసాదించగల 'శ్రీసాయిబాబా చరిత్ర' ఆయన సగుణ రూపంగాక ఏమిటి? 'గురుగ్రంథ సాహెబ్' కాదా?"

క్రీ.శ 1469 లో శ్రీ గురునానక్ దేవ్ గారు నన్‌కానా సాహెబ్ (లాహోర్, పాకిస్థాన్) లో జన్మించారు. తర్వాత కాలంలో ఆయనే ప్రఖ్యాత సిక్కుమతాన్ని స్థాపించారు. 'సిఖ్' అంటే సంస్కృతంలో 'శిష్యుడు' అని అర్థము. పూజ్య గురునానక్, ఇంకా గురుపరంపరగా వచ్చిన 10 మంది గురువులు కలిసి సిక్కు ధర్మాన్ని నెలకొల్పారు. వారిలో ప్రతి ఒక్కరూ అంతకుముందటి గురుధర్మానికి క్రొత్తవి మరియు సమకాలీనమైన పద్ధతులూ కలుపుతూ వచ్చారు.

మొదటి పది సిక్కు గురువులు మనుష్యులుగా రాగా వారి 11వ మరియు చివరి గురువు ధరించినది విశిష్టమయిన రూపము. వారి 10వ గురువయిన గురుగోవిందసింగ్ అక్టోబర్ 1708 లో అన్నారు, "సబ్ సిఖా కో హుకుమ్ హై గురు మన్యో గ్రంథ్" – "అందరు సిక్కులనూ గ్రంథాన్ని గురువుగా అనుసరించమని ఆదేశిస్తున్నాను" – ఆ విధంగా పవిత్ర గ్రంథమైన 'శ్రీ గురు గ్రంథ్‌సాహెబ్' సిక్కుల చివరి గురువుగా అజరామరంగా నిలిచిపోయింది.

ఇంతకూ 'శ్రీ గురు గ్రంథ్‌సాహెబ్' ఏమిటి? అందులో ఏముంటుంది?

శ్రీ గురునానక్ గారు భగవత్తత్వం గురించి పాటలతో, ప్రార్థనలతో నేర్పించారు. వీటిని 'షబద్' లంటారు. ఆ తర్వాత వచ్చిన ముగ్గురు గురువులు శ్రీ గురు అంగద్ దాస్, శ్రీ గురు అమర్ దాస్, శ్రీ గురు రామ్ దాస్ గార్లు కూడా కీర్తనలు రాశారు. వాటిని తర్వాత 'పోథీ' అనే పుస్తకాలుగా గ్రంథస్థం చేశారు. అయిదవ గురువయిన శ్రీ గురు అర్జన్ దాస్ గారు వాటన్నిటినీ స్థిరపరచాలని సంకల్పించారు. కారణం అవి 'గురుబాణి' (గురువుల వాణి) మాత్రమే కాకుండా అందులో ఇతరులచే ప్రక్షిప్తాలు చేరటం ప్రారంభించాయి. ఆయన ఎన్నో ప్రయాసలుకోర్చి మొదట నాలుగు గురువులు బోధలన్నింటినీ సంకలనం చేశారు. ఆ విధంగా శ్రీ గురు అర్జన్ దాస్ గారు 'ఆదిగ్రంథ్' ను కూర్చారు. ఇంకా అందులో కబీర్, రవిదాస్, నామ్‌దేవ్, త్రిలోచన్, షేక్ ఫరీద్ వంటి 36 హిందూ మరియు ముస్లిం మహాత్ముల షబద్‌లను కూడా కలిపారు. ఆయన ఆదిగ్రంథ్ లో చివర కొన్ని ఖాళీ పేజీలు వదిలి పెట్టారు. కారణం అడిగితే, తర్వాత గురువుల షబద్‌ల కోసం అని చెప్పారు. పదవ గురువయిన శ్రీ గురు గోవింద్ సంగ్, తమ గురువయిన శ్రీ గురుతేగ్ బహదూర్ సాహెబ్‌ల షబద్‌లను చేర్చడంతో 'ఆదిగ్రంథ్' పూర్తయింది.

అజరామరమయిన తమ గురువును సిక్కులు అత్యంత భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. గురు గ్రంథ్‌సాహెబ్ పట్ల వారి ప్రవర్తనావళి ఎంత గొప్పగా ఉంటుందో చూద్దాం.

గ్రంథ్‌సాహెబ్‌కు సేవ చేసేటప్పుడు : (అంటే ఆ గ్రంథాన్ని పూజించేప్పుడు, చదివేప్పుడు)
1) తల ఎప్పుడూ కప్పుకొని వుండాలి.
2) చెప్పులు సాహెబ్ రూమ్ బయటనే విడవాలి.
3) సాధారణ శారీరక శుభ్రత కలిగివుండాలి.
4) బహిర్దేశానికి వెళ్తే స్నానం చేసి బట్టలు మార్చుకొని గురుసేవకి రావాలి.
5) గురువు (గ్రంథ్ సాహెబ్) నుండి చదివేటప్పుడు నోటిని కప్పుకొని వుండాలి.
6) సేవలో వున్నప్పుడు తినటం త్రాగటం చేయకూడదు.
7) గురుసేవలో వున్నప్పుడు అనవసరమైన సంభాషణ చేయకూడదు.

గురుగ్రంథ్‌సాహెబ్ చుట్టుప్రక్కల వున్నప్పుడు :
1) తల ఎప్పుడూ కప్పుకొని వుండాలి.
2) చెప్పులు విడవాలి, రూమ్‌లో అయితే తప్పనిసరి.
3) గురుగ్రంథ్‌సాహెబ్ ప్రక్కనుంచి వెళ్తున్నప్పుడు తప్పనిసరిగా భక్తి వినయాలతో వుండాలి.(నమస్కరించాలి)
పరిసరాలు :
1) గురుగ్రంథ్‌సాహెబ్ విడిగా గాలి వెలుతురు బాగావున్న ఒక ప్రత్యేక రూమ్‌లో వుంచుకోవాలి.
2) గది నేల, గోడలు, పైన శుభ్రంగా కడిగి అందంగా అమర్చుకోవాలి.
3) మహరాజ్‌ను మంజి సాహెబ్ పైన పెట్టాలి. మంజి సాహెబ్ కనీసం 12 అంగుళాల ఎత్తు, 36 అంగుళాల వెడల్పు మరియు 18 అంగుళాల లోతు వుండాలి.(మంజి సాహెబ్ అంటే ఆసనం)
4) సాహెబ్ పైగా గది పైకప్పుక్రింద మొక్కలతోగాని, సరియైన వస్తువులతో గాని కప్పుగా చక్కగా అమర్చుకొవాలి.
5) గురుగ్రంథ్‌సాహెబ్ వస్త్రాలు: పీఠం మీద ఋతువుకు సరియైన వస్త్రాలను అమర్చాలి. వేసవిలో పల్చని, చలికాలంలో మందమైన దుప్పటి లేక రగ్గు అమర్చుకోవాలి.
6) గురుగ్రంథ్‌సాహెబ్ క్రింద విడిగా ఒక తెల్లని శుభ్రమైన నాణ్యతగల పట్టాని అమర్చాలి.
7) ప్రసాదము, మిగతా సామాగ్రి వుంచటానికి చౌర్‌సాహెబ్‌ని గురుగ్రంథ్‌సాహెబ్ ప్రక్కగా పెట్టుకొవాలి.(నైవేద్యం పెట్టిన ఆసనాన్ని కూడా 'సాహెబ్' అని గౌరవంతో సంబోధించడం గమనార్హం)
సాహెబ్‌తో వెళ్తున్నప్పుడు:
గురుగ్రంథ్‌సాహెబ్ వెళ్తున్నప్పుడు ఐదుగురు (కనీసం ముగ్గురు) కూడా ఎల్లప్పుడూ వుండాలి. ఈ సిక్కులు పాదరక్షలు వేసుకోకూడదు. ఒక సిక్కు చౌర్‌సాహెబ్ సేవ కోసం వుంటారు. ఒకరు ముందుగా వెళ్తూ దారిలో నీళ్ళు లేదా తడిపిన పూరేకులను చల్లుతూ

వెళ్తూండాలి.

ముఖ్యుడైన గురుగ్రంథ్‌సాహెబ్ పట్టుకునే సిక్కు ఒక శుభ్రమైన రుమాలును తమ టర్బన్(తలకట్టు) మీద వుంచి, జాగ్రత్తగా సాహెబ్‌ను రుమాలు మీద వుంచాలి. గురు స్వరూపము ఎప్పుడూ కప్పివుండటంకోసం ఒక రుమాలుతో సాహెబ్‌ను పూర్తిగా కప్పివుంచాలి.

మిగిలిన ఇద్దరు సింగ్‌లు సాహెబ్ ప్రక్కగా ఒకరు ఎడమవైపు ఒకరు కుడివైపు నడవాలి.

సంఘానికి గురువుగారి ఆగమనం తెలిపేందుకు బూరాలుకాని, ఏదైనా వాయిద్యాన్ని కానీ వాడాలి లేదా ఎల్లప్పుడూ 'వాహేగురూ' నామాన్ని చెప్తూండాలి.

కారులో ప్రయాణించేటప్పుడు గురువుగారిని తలపైగాని, వళ్ళోగానీ పెట్టుకోవాలి. అప్పుడు కూడా ఒక శుభ్రమైన రుమాలును గురువుగారి క్రింద పెట్టుకోవాలి.

ఇంకా,

1) మహరాజ్‌ను ఎప్పుడూ మూసిన రాక్ లేదా కప్‌బోర్డ్‌లో (గూట్లో) వుంచకూడదు

2) ఎవరూ గురువుగారి కంటే ఎత్తైన చోట కూర్చోకూడదు.

3) రాత్రివేళ సాహెబ్‌గారిని విడిగా ఒక ప్రత్యేకమైన మంచంమీద వుంచాలి.

ఇలా శ్రీ సాయి లీలామృతాన్ని 'శ్రీ గురుగ్రంథసాహెబ్' తో పోల్చడంలో ఆచార్యులు మనకు అద్భుతమైన ఆధ్యాత్మిక సూత్రాన్ని తెలిపారు. అట్టి పవిత్ర గ్రంథాల పట్ల మనకుండవలసిన భావపవిత్రతను, గౌరవాన్నీ, అట్టి గ్రంథం పట్ల మన ఆచరణ ఎలా ఉండాలి అనే విషయాన్ని చెప్పకనే చెప్పారు. ఇది ఇంకొంచెం పరిశీలిద్దాం. శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిలీలామృతము మాత్రమేకాక పూజ్య మాష్టరుగారి రచనలన్నీ అక్షరరూపమైన గురుస్వరూపాలుగా మనం గుర్తించాలి. భక్తులందరూ వాటిని గురుగ్రంధసాహెబ్ కిచ్చిన భక్తి పూర్వక వినయవిధేయతలతో సేవించుకోవాలి. క్రియారూపంగా వీలుకాకపోతే మానసికంగానయినా అలా సేవించుకోగలగాలి. అవునంటారా?

సిక్కులు వారి 'గురు' గ్రంథాన్ని ఎంతటి భక్తి శ్రద్ధలతో సేవిస్తారో, వారి నియమాలు ఎంత పవిత్రంగా ఉన్నాయో! మరి భగవద్గీత మొదలు ఆచార్యుల రచనల వరకూ అన్ని గ్రంథాలు అట్టి మహనీయుల వలన ప్రసాదించబడినవే కదా? వాటిలోని (వారిలోని) విషయాలన్నీ అనేక మంది మహనీయుల వచనాలే (షబద్) కదా? మరి అట్టి గ్రంథాల పట్ల మన ప్రవర్తన ఎలా ఉన్నది? ప్రవర్తన సంగతి దేవుడెరుగు, కనీసం అంతటి పవిత్రత మనలో ఉన్నదా?


చదవండి! **శ్రీ సంహితాయన గురుద్విసాహస్రి** చదివించండి!!

సంస్కృత మూలము : శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి

తెలుగు : ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

వెల : రూ॥ 80-00 లు

ప్రతులు:- **శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్**,

c/o, **Sri Manga Bharadwaja Trust,**

Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,

Jaipuri Colony, Nagole, Hyderabad - 68

Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**

# సాయి 'చరిత్ర'లు వ్రాయకండి

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

శ్రీ సాయిబాబా మహిమ దశదిశలా వ్యాప్తి చేయడంలో వివిధ భాషలలో వెలువడ్డ, వెలువడుతూన్న సాయిచరిత్రల పాత్ర అద్వితీయం. కాని ఈ 'చరిత్ర' లను పరిశీలిస్తే ఒక శోచనీయమైన విషయం కన్పిస్తుంది. సాయి చరిత్రకారులు ఎక్కువమంది సాయిబాబా పుట్టు పూర్వోత్తరాలను గురించి ఎన్నో రకాల ఊహాగానాలను చేశారు. కొంతమంది సాయిబాబా పత్రి గ్రామంలో పుట్టాండటే మరి కొంతమంది సాయి సేలూ గ్రామంలో పుట్టాడని వ్రాశారు. ఈ రచయితల కథనాన్ననుసరించి బాబా బ్రాహ్మణ దంపతులకు జన్మించారనీ, తర్వాత వారినొక ముస్లిం ఫకీరు పెంచారనీ, హైదరాబాదుకు చెందిన ఒక ప్రబుద్ధుడు బాబా గుజరాత్ వైష్ణవ బ్రాహ్మణ దంపతులు ఒక ముస్లిం ఫకీరుతో మక్కాయాత్ర చేస్తుండగా(!) దారిలో జరూసలియంలోని 'జఫా' అనే ప్రదేశంలో 1858 మార్చి 11 ఉదయం 9 గం॥లకు (!!) జన్మించారనీ, అక్కడే తల్లిదండ్రులను కోల్పోయి కొంతమంది యాత్రికులతో కలసి భారతదేశం తిరిగొచ్చి, మధురా బృందావన్ సమీపాన అనాధగా పడివుంటే శ్రీ రామచంద్ర బాబాజీ అనే సాధువు సాయికి పరాశక్తి ఉపాసనలో దీక్ష యిచ్చాడనీ... వ్రాశాడు. హైదారబాద్‌లోనే వుంటున్న ఇంకో చిన్న సైజు పీఠాధిపతి సాయిబాబా నాగపూర్‌లోని ఒక లాయరు కూతురిని ప్రేమించాడనీ... వగైరా నోటికొచ్చిన కట్టుకథలను ప్రచారం చేస్తున్నాడు. ఎవరికీ అంతుబట్టని సాయి జన్మ రహస్యాన్ని గూర్చి వ్రాసిన అభూతకల్పనలకు ఇవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే. ఇటువంటి నిరాధారమైన రకరకాల రాతల వల్ల రాబోవు తరాలవారికి 'సాయిచరిత్ర వాస్తవమా, కల్పితమా?' అనే సందేహం కలుగక మానదు. రామ కృష్ణాదులవంటి అవతార పురుషులను గూర్చి విభిన్నమైన కథలుండడంవలన వారసలు చారిత్రక పురుషులే కారని కొట్టిపారవేయటంలేదా ఈనాడు కొందరు బుద్ధిమంతులు! ఈ రచయితల 'చరిత్ర' లకు ఆధారం కొందరికి తమ వూహాశక్తి అయితే, మరొకొందరు సాయిబాబా తమకు దర్శనమిచ్చి స్వయంగా అట్టి వివరాలను తెలిపారని చెబుతున్నారు! భౌతిక దేహంతో శిరిడీలో ఉన్న 60 సం॥ల లోనూ వెల్లడించని తన జన్మరహస్యాన్ని ఈ భక్తులకు ఇప్పుడాయన ఎందుకు విన్నవించుకుంటున్నారో మరి! అదీ తలకోవిధంగా!! బాబా జన్మతః హిందువనడానికీ, ముస్లిం అనడానికీ గూడా ఆధారాలు వారి జీవితంలో దొరుకుతాయి. శ్రీ రామకృష్ణ పరమహంస సర్వమత సాంప్రదాయాలననుసరించి సాధనలు చేసి అన్నిమతాల చరమానుభూతి ఒకటేనని చాటినా, కబీరు రామ్ రహీములొక్కరేనని ఘోషించినా, రమణమహర్షి అన్నిమతాలకతీతమైన సాధనామార్గాన్ని ఉపదేశించినా–వారు జన్మతః హిందువులో, ముస్లిములో అవటాన సాంప్రదాయకులైన అన్యమతస్థులు వారిని మనస్ఫూర్తిగా ఆశ్రయించలేకపోయారు. సాయిబాబా అలాగాక తన జన్మరహస్యాన్ని వెల్లడిచేయక పోవడమే గాక, అద్భుతమైన రీతిని హిందువులకు హిందువుగా, ముస్లింలకు ముస్లిముగా ప్రకటమై ఆ రెండు మతాల్లోని ఎంతటి ఛాందసులైనా ఆయనను 'తమవాడిగా' స్వీకరించేందుకు అవకాశమిచ్చారు! ఇది ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలోనే అపూర్వం. ఇతరులనుండి దాచుకునేందుకు తనకంటూ 'ఒక వ్యక్తిగత' జీవితంలేక, తన జీవితాన్నంతటినీ ఆదర్శంగా, 'కొండమీద దీపం' లా ఉంచిన సాయి తన జన్మ వివరాలను మాత్రం ఎందుకు రహస్యంగా ఉంచారో కొంచెం వివేకంతో ఆలోచిస్తే తెలుస్తుంది. ఈ సూక్ష్మం గుర్తించక తమకు తట్టిన, నచ్చిన అసంబద్ధమైన సిద్ధాంతాలను ప్రచారం చేయడం సాయితత్వ ద్రోహమేమరి!

# గురువు గొప్పా? దైవం గొప్పా?

మన సాంప్రదాయమున ఈశ్వరుడును, గురువును ఒక్కడే. "యస్యదేవే పరాభక్తిర్యథా దేవేతథాగురౌ. తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః ॥"

కానీ, దేవుడుచేయు మూడు కార్యములు సృష్టి, స్థితి, లయములు మాత్రము గురువునకు లేవు. దేవుని కడకు మనము ఏ విషయమునకై వెళ్ళుదుమో వానిని గురువే మనకొసగగలడు. పరాభక్తి మాత్రము మనకు మన గురువునందుండవలెను. దేవునియందెట్టి భక్తి నుంచెదమో, అట్టి భక్తియే గురువునందు సహితముంచవలెను. గురువు దొరకనప్పుడు దేవుడు అవసరము. దైవభక్తికంటే గురుభక్తి గురుతరము, ప్రయోజనకారి. "దేవుడు గురువు కంటే అధికుడని నేను చెప్పజాలను" అని వేదాంతదేశికులందరు– "శివేరుష్టేగురుస్త్రాతాగురౌరుష్టేనకశ్చన".

'శివుడు కోపగించుకొన్న గురువు రక్షించును. గురువే కోపగించిన అతనిని రక్షించుటకు ప్రపంచమున నేరక్షకుడునూ లేడు' అని అనుట వాడుక. గురువునందు అనన్య భక్తితో ఏ దాపరికము లేక శరణుజొచ్చిన అతడు మనలను దుఃఖముల నుండి రక్షించి మోక్షమునకు గొని పోవును. ఈశ్వర భక్తికి గురుభక్తి అవసరము. ప్రజలకు గురుభక్తి లేమిచేతనే దైవభక్తి కుదురుటలేదు.

– శ్రీకంచి కామకోటి శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి.

# సాయిబాబా చూడ్డానికెలా ఉండేవారు?

సాయిబాబా సుమారు 5 1/2 అడుగుల ఎత్తు ఉండేవారు. అటు సన్నమూ, లావు గాక దృఢంగా ఉండేవారు. శరీరచ్ఛాయ పచ్చని పసిమి. కళ్ళు నీలవర్ణంగా ఉండేవి. విశేషమేమంటే ఆయన కళ్ళు పులి కళ్ళలా చీకట్లో మెరిసేవి. భక్తులంతా బాబా కళ్ళ విషయం గురించి ఎంతో విశేషంగా చెప్పుకునేవారు. ఆయన రాతిపై కూర్చున్న ఫోటోలో కళ్ళు కొద్దిగా మెల్ల వున్నట్లుంటుంది. కానీ నిజానికి కాయనకట్టి మెల్లలేదు. బాబా ముక్కు పుటాలు పెద్దవి. ఆయనకు కొన్ని పళ్ళు లేవు. ఉన్నవికూడా స్వచ్ఛమైన తెలుపు కాదు. కారణం ఆయన పళ్ళనెప్పుడూ తోముకొనేవారు కాదు. నీటిని మాత్రం పుక్కిలించేవారు. ఆయనెప్పుడూ అతి ముతక దుస్తులే ధరించేవారు. వేసుకున్న కఫ్నీని రెండు మూడు నెలల లోపల మార్చేవారు కాదు. అరుదుగా ఒక పచ్చని లుంగీ కట్టుకొని, కఫ్నీ ఉతికి ధునిమీద ఆరబెట్టి ధరించేవారు. ఆయన తలకు రుమాలెందుకు ధరించేవారో ఎప్పుడూ ఎవ్వరికీ చెప్పలేదు. స్నానం చేసేటప్పుడు తప్ప కఫ్నీ లేకుండా ఎప్పుడూ ఉండేవారు కాదు.

# నిరాడంబరత– రమణమహర్షి

- ద్వారకనాథ్

“శరీరవే నీవను భావనను రానీయకు” అన్నారు భగవాన్ రమణమహర్షి. 1950 వరకు సశరీరంగా మానవాళికి అందుబాటులోనున్న భగవాన్, తాము శరీరమేననే భ్రాంతిని వీడి సర్వత్రా సర్వదా వేంచేసియున్న, నిలచియున్న నిశ్చల పరమాత్మతత్వంలో ఐక్యం చెంది ఉండేవారు. నిశ్శబ్దమే తమ ప్రధాన బోధగా కల రమణుల సన్నిధికి ఎందరెందరో వచ్చి వారి ఆశీస్సులను, అప్పుడప్పుడూ వారి బోధలను అందుకుని ధన్యులయ్యారు. పరిపూర్ణ జ్ఞానస్థితిని ఆరూఢించిన అంతటి మహానీయమూర్తిని కళ్ళారా దర్శించడం ఎంతటి మహాభాగ్యమో కదా!

ఏ మతానికీ, కులానికీ పరిమితం కాని వారి బోధలు మానవుని నిజతత్వమైన ఆత్మను తెలుసుకొనే సనాతన, నిత్యనూతన బోధను ప్రతిబింబించేవి. వారి సన్నిధికి అనేక సాంప్రదాయాలకు చెందిన వ్యక్తులు తరలివచ్చారు. వారి జ్ఞానస్థితికి తలలువంచి నమస్కరించారు. సార్వజనీనమైన వారి కృపను చవిచూచి వారిని సత్కారాలతో ముంచెత్తారు. కానీ రమణులు మాత్రం వారి సహజ సత్పురుష వైఖరిని, నిరాడంబరత్వాన్ని , వైరాగ్యాన్ని వీడక ఎంతో నిష్ఠగా(మనదృష్టిలో) ఉండిపోయారు.

శరీరము తాననే భ్రాంతి కించిత్తైనా లేని భగవాన్‌కు నిరాడంబరతో పనేమిటి? ఆడంబరానికీ, నిరాండబరానికీ అందని అద్భుత స్థితిలోని వారికి నిరాడంబరత్వాన్ని పాటించాల్సిన పనేమిటి? మరెందుకు అలా పాటించారు?

భక్తులెవరైనా మహర్షికోసం ప్రత్యేక ఆసనం అమర్చినా, ఆహారపదార్థాలను తెచ్చినా వాటిని అంగీకరించక అందరితో కలసి భోజనం చేస్తూ అందరూ తినే పదార్థాలనే భుజిస్తూ, కౌపీనానికి మించి ఆచ్ఛాదనైనా లేకుండా ఉండేవారు మహర్షి. ప్రత్యేక పూజలు వారికి వారెన్నడూ చేయించుకోలేదు సరికదా చేయబోతే వారించేవారు కూడానూ. తమకు తాము ఎట్టి ప్రత్యేకతను ఆపాదించుకునేవారు కాదు.

చిన్న వయసులోనే అరుణాచలుని పిలుపు విని, సర్వాన్ని విడచి అరుణాచలం చేరి తీవ్రసాధనలో దేహభ్రాంతి సైతం లేకుండా, ధ్యానంలో నిమగ్నులయ్యారు భగవాన్. ఎండా – చలి తెలియవు. కాళ్ళను పురుగులు కుడుతున్నా తెలిసేది కాదు. అట్టి నిశ్చల సమాధిలో ఎంతోకాలాన్ని గడిపారు భగవాన్. సాధకావస్థలోనే(మనదృష్టిలో) దేహప్రజ్ఞలేని ఆయనకు జ్ఞానరూఢత కలిగాక నిరాండబరత అన్న చిన్న సూత్రం కోసం దేహప్రజ్ఞ కలిగిందని అనగలమా?

‘ఇంత నిరాడంబరంగా ఉండడం ఎందుకు?’ అని ప్రశ్నించినప్పుడు సామాన్యంగా తోచే సమాధానం ‘అలా ఉండి చూపితే అందరమూ అనుసరిస్తాము గనుక వారు ఆచరించి చూపిస్తారు’ అని ‘యద్యదాచరతి...లోకస్తదనువర్తతే’ అన్న సూత్రంలాగా. ఇది చక్కటి సమాధానమే కానీ ‘జ్ఞాని అందరినీ తన రూపంగా దర్శిస్తాడు కదా! ఆయనకి ఆచరించి చూపి ఉద్ధరించాలని ఉంటుందా?’ అని తిరిగి ప్రశ్న వస్తుంది. దీనికి సమాధానం మన దృక్పథం మీద ఆధారపడి ఉంటుంది. సర్వాన్ని నడిపే దైవమే మరలా జ్ఞానుల రూపంలో ఉద్ధరణ మార్గాన్ని చూపుతారన్న దృక్పథంలో ఏది సమంజసం. కానీ ఇంకొంచెం విపులంగా ఆలోచిస్తే మరో దృక్పథం కనిపిస్తుంది.

తీవ్రసాధన చేసి జ్ఞానస్థితినందిన మహానీయులు ఈ అనంతవిశ్వాన్ని లీలామాత్రంగా, సంకల్పమాత్రంగా నడిపే విశ్వచైతన్యంతో తాదాత్మ్యం చెంది ఉంటారు. వారికి సకల సృష్టి తమ రూపంగా, భగవద్రూపంగా గోచరిస్తుంది. ‘వాసుదేవస్సర్వమితి’ అన్నట్టుంటుంది వారి దృక్పథం. అందుకు సకల సృష్టి ఏ ధర్మాలను అనుసరించి పనిచేస్తున్నదో అట్టి ధర్మాలను వారు అతిక్రమించరు. వారు రూపమైన, సంకల్పమైన సకల సృష్టి ధర్మాలూ అట్టి మహానీయులలో సామరస్యాన్ని పొందుతాయి. వారి శరీరాలు సైతం అట్టి ధర్మనిరతితో నడుస్తాయి. వారు చేసే ప్రతి చర్య అందుకు పరమధర్మప్రతీకగా నిలుస్తుంది. ఇదంతా, సామాన్య సాధకునిలా ప్రయత్నపూర్వకంగా కాక, పువ్వుకి పరిమళంలా సహజంగా, ప్రకృతిసిద్ధంగా, లీలగా, అవలీలగా వ్యక్తమవుతుంది. నిరంతర జ్ఞానస్వరూప సిద్ధి కలిగినవారికి ‘ నేను ఇలా ఉండాలి, నేను (అంటే ఈ పేరు, ఈ వయస్సు

కల ఈ దేహమానసాదులు) ఈ విధంగా నడవాలి, అనే పరిమితి ఉండదు. వారున్న పరిస్థితికి ఏది ధర్మమో అది వారినుండి వ్యక్తమవుతుంది.

ఇలాంటి సమన్వయం తీసుకోకుంటే 'ఫలానా మహాత్ముడు ఇలా లేడే? వారు మాలలు వేయించుకొని పూజలు చేయించుకున్నారే!' అనే రంధ్రాన్వేషణ జరిగి, మహాత్ముల మధ్య తారతమ్యాలను చూచే దారుణ స్థితికి చేరుతుంది మనస్సు. వారు చేసేది ధర్మమని, పరమధర్మమని స్ఫురించనిదే వారి జ్ఞాన స్థితిని శంకించే అగత్యం తప్పదు.

అలా అని ఎవరు మహాత్ములో, ఎవరు కారో తేల్చేదెలా? ఆచరణనుకాక మనం దేనిని చూచి అంచనా వేసుకోవాలి? అంచనా వేయకుంటే కుహనాగురువుల బారిన పడకుండా మనలనూ సాటివారినీ రక్షించుకునేదెలా?

జాగ్రత్తగా చరిత్రను గమనిస్తే, భారతదేశంలో కొంత తక్కువ తరచుగా అలా జరిగి ఉండవచ్చునేమో గానీ, ప్రపంచవ్యాప్తంగా మహాత్ములను అంచనా వేసిన ప్రతీసారి మానవజాతి నిండా మునిగిపోయింది. అవకతవక అవగాహనతో అలా అంచనా వేసే ఏసుప్రభును మన జాతి శిలువ వేసింది.

అలా అని 'అంచనా వేయకుండా ఉన్నప్పుడేమైనా బాగుపడ్డారా మానవులు?' అంటే నిజమే. నేటికీ అనేకులైన దొంగ గురువుల బెడద సంఘానికి తప్పడం లేదు.

మరేంటి సమాధానము? శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిలీలామృతాల పారాయణ, మహాత్ములైన శ్రీ రమణ భగవాన్, శ్రీ రామకృష్ణ పరమహంస మొదలైన వారి చరిత్రల పారాయణ. చక్కటి పరిణతి కలిగించి మహనీయుల దర్శన ఆశీస్సులు ప్రసాదించమని, గురువును చూపమని భగవంతునికి ప్రార్థన. ఇవి మాత్రమే సరైన మార్గాలు. సమయమొచ్చినప్పుడు భక్తునికి తానే దర్శనమిస్తానని వాగ్దానం చేశారు కదా మహనీయులు? సమర్థ సద్గురుడైన ఆచార్యులు ఆచరించి చూపిన విధానమదేకదా!

జై సాయిమాస్టర్!

జై రమణభగవాన్!

జై సాయి మాస్టర్ !!

ప్రియ గురు బంధువులారా! జగద్గురు శ్రీ సాయిమాస్టర్ ఆధ్యాత్మిక సేవలనందించడానికి, దివ్యజనని అలివేలుమంగమ్మ భరద్వాజుల ఆశీస్సులతో 'శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్' స్థాపించబడినది. సాయిమాస్టర్ భక్తులు, జిజ్ఞాసువులు-పుస్తకములు, ఫోటోలు మొదలగు వాటికొరకుగాని, విరాళములు మరియు Magazine Subscriptions మొదలగు అన్ని విషయములకు ఇకనుండి ఈ క్రింది అడ్రసును సంప్రదించగలరు. D.D.లు, M.O.లు కూడా ఈ క్రింది అడ్రసుకు పంపించగలరు.

**Sri Manga Bharadwaja Trust**,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone :040-20063300

**పూజ్య శ్రీ సాయిమాస్టర్ సేవాభిలాషులు యీ క్రింది చిరునామాలకు విరాళాలర్పించి తరించగలరు.**

**Magazine** మరియు **General Donations** ను **"Sri Manga Bharadwaja Trust"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు.

**Annadanam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Sai Master)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు.

**Ashramam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Peace Foundation)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల్వారా పంపగలరు.

**Books order** ను **"Sri Manga Bharadwaja Trust (Publications)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు.

వరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక, వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 50-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్థవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు? | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 15-00 |
| విజ్ఞాన వీచికలు | 50-00 |
| పరిప్రశ్న | 40-00 |
| మతమెందుకు? | 30-00 |
| ఏది నిజం? | 30-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 40-00 |
| బుద్ధధ్యాన హృదయం | 30-00 |
| దత్తావతార మహత్మ్యం | 40-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 80-00 |
| పురుషసూక్త రహస్యం | 30-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 45-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 25-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 30-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 45-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 35-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 40-00 |

## ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 40-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 40-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 55-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Guru Charitra | 70-00 |
| Supreme Master (Swami Samartha) | 60-00 |
| Sai Baba and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 60-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Charitra (Kannada) | 99-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |
| Stavana Manjari (Tamil) | 3-00 |

SRI GURUPADUKA PUBLICATIONS
c/o, **Sri Manga Bharadwaja Trust,**
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**